thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 23 | కరీంనగర్ గురువారం, 3 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.


# ఖగర్ తలపెట్టిన నరసంహారణాన్ని ఆపాలి..!

## శాంతి చర్చలపై మేధావులు అభిప్రాయాన్ని గౌరవిస్తున్నాం

## మావోయిస్టు పార్టీ ప్రతిపాదనపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఏమిటి?

## కోట్లాదిమందిని తొలుస్తున్న ప్రశ్న..?!




భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
కేంద్ర కమిటీ
తేది : 28.3.2025.

**చురకలు ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

మధ్య భారతంలో సర్కార్ తలపెట్టిన కగార్ ఆపరేషన్ లో భాగంగా నరసింహారాన్ని ఆపి శాంతి చర్చలకు ప్రభుత్వం ముందుకు రావాలని అందుకు తమ పార్టీ కూడా సిద్ధంగా ఉందనిభారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పక్షాన అభయ్ బుధవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల హైదరాబాదులో తలపెట్టిన శాంతి చర్చల కమిటీకి, దేశ ప్రజలకు విజ్ఞప్తి చేసిన పార్టీ శాంతి చర్చలు ముందుకు తీసుకెళ్లాల్సిందిగా కోరిందని, ఈ లేఖ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుంది ఓవైపు కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది నాటికి నక్సలైట్ ఉద్యమాన్ని పూర్తిగా తుడిచివేస్తామని ప్రకటిస్తూనే నిత్యం ఎన్కౌంటర్ల పరంపర కొనసాగిస్తున్న క్రమంలో మావోయిస్టు పార్టీ ఇచ్చిన లేఖకు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఇక్కడ ఆసక్తిగా మారింది. శాంతి చర్చల కోసం దేశవ్యాప్తంగా మేధావులు ప్రతిపాదిస్తున్న అంశాన్ని మావోయిస్టు పార్టీ స్వీకరించి ముందుకు వచ్చిన సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలపైనే శాంతి చర్చలు ముందుకు వెళ్లే అవకాశం ఉంది. అబయ్ పంపిన లేఖ సారాంశాన్ని లేదా తరంగా అందిస్తున్నాం.. 'మధ్యభారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలి, భారత ప్రభుత్వం– సీపీఐ (మావోయిస్టు) బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలి' అనే అంశంపై మార్చి 24న హైదరాబాద్ లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. నేటి స్థితిలో శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, అది శాంతి కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడాన్ని మేము స్వాగతిస్తున్నాం. ఈ సందర్భంగా, శాంతి చర్చల పట్ల మా పార్టీ వైఖరిని తెలియజేస్తున్నాం. 2024 జనవరిలో, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం, విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 'కగార్' పేరుతో విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల ప్రజలపై ప్రతిఘాతక యుద్ధాన్ని ప్రారంభించాయి. ఆ సమయంలో ప్రజల్ని మోసగించడానికి ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి/ హెూంమంత్రి విజయ్ శర్మ 'మా ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడానికి సిద్ధమే. మావోయిస్టులు చర్చలకు రావాలి' అని పదే పదే ప్రకటనలు చేసాడు. ఆ సందర్భంగా మా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ వికల్ప్ రెండు సార్లు మా పార్టీ శాంతి చర్చలకు సిద్ధమేనని తెలియజేసాడు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం, 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్ లకే పరిమితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేసాడు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నింటా, ముఖ్యంగా ఛత్తీస్ గఢ్ లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయి. ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైబడిన సంఖ్యలో మా పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయిల కమాండర్లను, సభ్యులను, సాధారణ ఆదివాసీ ప్రజానీకాన్ని హత్య చేసాయి. ఇందులో 1/3 సంఖ్యలో సాధారణ ఆదివాసీ ప్రజలు హత్య చేయబడ్డారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్టులు చేసి అక్రమ కేసులు మోపి జైళ్ల పాల్జేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారమే సాధారణ ప్రజానీకాన్ని హత్య చేస్తున్నాయి. చుట్టివేసి చంపివేసే (కార్డన్ అండ్ కిల్) ఆపరేషన్లలో చిక్కుకుంటున్న మా పార్టీకి, పీ.ఎల్.జీ.ఏ.కు చెందిన నిరాయుధ సభ్యులను, గాయపడి శత్రు సాయుధ బలగాలకు చిక్కిన సభ్యులను అమానవీయ చిత్రహింసలకు గురిచేసి హత్య చేస్తున్నాయి. మహిళా కామ్రేడ్స్ ను సామూహిక అత్యాచారాలు చేసి హత్య చేస్తున్నాయి. అందుకే ఈ యుద్ధాన్ని నరసంహారం (జీనోసైడ్) అంటున్నాం. ఈ యుద్ధంలో కేంద్ర ప్రభుత్వం కమాండో బలగాల ముసుగులో భారత సైన్యాన్ని మోహరించింది. విప్లవోద్యమ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించకుండానే **(మిగతా 4వ పేజీలో)**

# హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ.. ఏ పార్టీ బలం ఎంతంటే?




హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 28న నోటిఫికేషన్ విడుదల కాగా, ఏప్రిల్ 4వ తేదీ నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఏప్రిల్ 23వ తేదీన పోలింగ్ జరుగనుంది.

ఏప్రిల్ 25వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ పదవీ కాలం ఈ ఏడాది మే 1వ తేదీకి ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అంతేకాదు.. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కోడ్ అమలులోకి వచ్చింది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు దాదాపు ఏకపక్షంగానే జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఎవరి బలం ఎంతో ఓసారి తెలుసుకుందాం.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మొత్తం ఓట్లు 110 ఉన్నాయి. అందులో 81 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్అఫీషియో సభ్యులు.. ఉండగా.. ప్రస్తుతం 3 డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. ఇందులో ఎంఐఎం పార్టీకి 49 ఓట్ల బలం ఉంది. అందులో ఒక ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీతో పాటు 40 మంది కార్పొరేటర్ల మద్దతు ఉంది. ఇక బీఆర్ఎస్‌కు 25 ఓట్లు ఉన్నాయి. ఇందులో ముగ్గురు రాజ్యసభ ఎంపీలు, ఇద్దరు ఎమ్మె ల్సీలు, ఐదుగురు ఎమ్మెల్యేలు, 15 మంది కార్పొరేటర్లు ఉన్నారు. బీజేపీకి 19 మంది మద్దతుంది. వీరికి ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ, 19 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇక అధికార కాంగ్రెస్‌కు కేవలం 14 ఓట్లే ఉన్నాయి.

ఇందులో ఒక రాజ్యసభ ఎంపీ, నలుగురు ఎమ్మె ల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఏడుగురు కార్పొరేటర్లు ఉన్నారు. ప్రస్తుతం 49 ఓట్లతో ఎంఐఎం పార్టీ బలంగా ఉంది. దీనికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తే.. విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.




ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు భారత వాయుసేన గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పౌర విమాన సేవలను ప్రారంభించేందకు అనుమతులు మంజూరు చేసింది. ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు రావడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమన్నారు మంత్రి కోమటిరెడ్డి. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టునుఅభివృద్ధి చేసి పౌర విమానయాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి భారత వాయుసేన అంగీకరించింది.

త్వరలోనే అక్కడ వాయుసేన శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉన్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన లేఖ ద్వారా సూచించిందని కోమటిరెడ్డి తెలిపారు. రన్ వే పునర్నిర్మాణ , పౌర టర్మినల్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ ఎప్రాన్ సహా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు కోమటిరెడ్డి. వీటికి అవసరమైన భూమిని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఇవ్వాలని వాయుసేన సూచించినట్లు చెప్పారు. ఈ విషయంపై అధికారులతో సమీక్షిస్తున్నామని...త్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి పంపిస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

# బీసీ రిజర్వేషన్ పై...
# ఇక ధర్మయుద్ధమే...




## 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే మోదీకి ఏంటి సమస్య..?

## ఢిల్లీ బీసీ పోరు గర్జనలో సీఎం రేవంత్!

బీసీలకు రిజర్వేషన్ 42శాతం పెంచుతూ తెలంగాణ తీర్మానం చేసిందని ఆ బిల్లును కేంద్రం ఆమోదించాలని లేదంటే ధర్మయుద్ధం తప్పదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇవాళ ఢిల్లీ లోని జంతర్మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల సాధనకు చేపట్టిన బీసీ సంఘాల ధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా లెక్క తేలాలన్నారు. అదేవిధంగా రిజర్వేషన్ల అంశాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. జనాభా లెక్కలు తెలియకపోతే రిజర్వేషన్లు ఇచ్చేందుకు లేదని కోర్టులే చెప్పాయని తెలిపారు. దీంతో జనగణనతో పాటు కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని రేవంత్ ఆరోపించారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చింది. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదు.రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించాం.రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారం. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ (మోదీ) రాష్ట్రంలో చేయమని మేము అడగలేదని సీఎం గుర్తు చేశారు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు.అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని రేవంత్ రెడ్డి అన్నారు.కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు "అయిననూ హస్తిన పోయి రావలె".. ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు.మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందేనని తేల్చి చెప్పారు. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు?దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నామన్నారు.రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారని ఆరోపించారు.ట్రిపుల్ తలాఖ్ తెచ్చారు. ఆర్టికల్ 370 రద్దు చేశారు. వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చింది? అంటూ నరేంద్రమోదీని సీఎ నిలదీశారు.బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారు. మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు అంటు గుర్తు చేశారు.? మీరు మా డిమాండ్లకు దిగి రావాలి. లేదంటే మీరు దిగిపోవాలి, బీసీలు ధర్మయుద్ధం ప్రకటించాలి. నరేంద్ర మోదీ గారు వినండి. మేము ఇక ఢిల్లీకి రాం. మీరే మా గల్లీకి రావాలంటూ సంచనల ప్రకటన చేశారు సీం రేవంత్ రెడ్డి,. కురుక్షేత్ర యుద్ధంలో 5 గ్రామాలు ఇవ్వాలని సంధి ప్రయత్నం జరిగింది. కానీ దుర్యోధనులు వినలేదు. తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసు. మేము కూడా ఇప్పుడు సయోధ్యకు వచ్చాం. మా రిజర్వేషన్ల పెంపునకు ఆమోదం చెప్పండి లేదంటే ధర్మయుద్ధం తప్పదని సీఎం రవంత్ రెడ్డి హెచ్చరించారు.




దిల్లీ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో దిల్లీ జంతర్‌మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "బీసీల గొంతు వినిపించడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. జనాభా ఎంతో తెలియకుండా రిజర్వేషన్లు ఇవ్వడానికి లేదని కోర్టులు చెప్పాయి. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా తేలాలి. జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. దామాషా ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టాలనేది మా పార్టీ నిర్ణయం. బీసీలను బలపర్చాలనే ఆలోచనకు భాజపా వ్యతిరేకం. బీసీల లెక్కలు తేల్చాల్సి వస్తుందని 2021 జనాభా లెక్కలను వాయిదా వేశారు. జనగణనతోపాటు కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆ నివేదిక ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలి" అని సీఎం అన్నారు.




## కంచ గచ్చిబౌలి భూముల్లో పనులు ఆపాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) తరఫున ఎల్. రవిశంకర్ వాదనలు వినిపించారు. "గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీ(%ు+××జ%)కి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల వద్ద భారీ వాహనాలను ఉపయోగించి చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. వన్య ప్రాణులు ఉన్న చోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించాలి. నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్‌లు ఉన్నాయి. రాక్స్ ఉన్నాయి. ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ఇక్కడ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి" అని కోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు" అని ఏజీ వాదనలు వినిపించారు. ఇప్పటివరకు ఈ భూమి అటవీ భూమి అని ఒక్క వాదన కూడా లేదు. కంచ గచ్చిబౌలి భూములు.. అటవీ భూములని ప్రభుత్వం సైతం ఎక్కడా నోటిఫై చేయలేదన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమలు, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలం మాత్రమేనని.. అటవీ భూమి కానే కాదన్నారు. నిజాం కాలం నుంచి ఈ భూమి.. బీడు భూమిగానే ఉందని కోర్టుకు తెలిపారు. అయితే, ఈ 400 ఎకరాలు పరిశ్రమల భూమి అని రికార్డుల్లో ఎక్కడైనా ఉందా? అని హైకోర్టు ఏజీని ప్రశ్నించింది. సర్వే నెంబర్ 25లో ఉన్న ఈ భూములను పలు అవసరాలకు కేటాయిస్తూ వచ్చారని న్యాయస్థానానికి తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

## ఎల్ఆర్ఎస్ రాయితీ గడువును పొడిగించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. ఎల్ఆర్ఎస్ ఫీజును 25% రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. తాజాగా ఆ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ ఆశించిన మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్నంతమేర స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పొడిగింపు నిర్ణయం తీసుకుంది.



## బీసీ రిజర్వేషన్ల పై సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ కౌంటర్



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది కదా అని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచేందుకు కేంద్రం ఆమోదం తెలపాలని సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఢిల్లీ వేదికగా జరిగిన బీసీ మహా గర్జన ధర్నాలో చేసిన వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. రాజ్యాంగం లోని ఆర్టికల్ 243 ప్రకారం.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సొంతంగా డెడికేషన్ కమిషన్ వేసుకొని చట్ట ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేసుకునే అధికారం ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఆ హామీ ఇచ్చే సమయంలో మోడీ ప్రభుత్వాన్ని సంప్రదించి ఇచ్చారా..? ఇప్పుడు ఎందుకు మోడీ ప్రభుత్వం పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని ప్రశ్నించారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతులు పట్టుకొని షో చేయడం కాదు ఆ రాజ్యాంగంలో ఏముందో అర్థం చేసుకొని అమలు చేయాలని ఇంగిత జ్ఞానం కాంగ్రెస్ నేతలకు లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్కు స్పష్టమైన మెజార్టీ ఉంది. టిఆర్ఎస్ సపోర్ట్ కూడా ఉంది. అలాంటప్పుడు బిజెపి పై నేపము ఎందుకు నేర్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు బండి సంజయ్.

## బీసీలు దేశానికి వెన్నెముక.. రిజర్వేషన్లకోసం గట్టిగా కొట్లాడుదాం: విజయశాంతి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయ శాంతి బీసీ రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీలు దేశానికి వెన్నెముకలాంటి వారు.. బీసీలకు న్యాయం జరగకపోతే దేశానికి న్యాయం జరగనట్లే అవుతుందన్నారు విజయశాంతి. బీసీ రిజర్వేషన్లకోసం ఉడుం పట్టు పట్టాల్సిన అవసరం వచ్చిందన్నారు. బీసీ రిజర్వేషన్లను రాహుల్ గాంధీ లేవనెత్తారు..అందుకు అనుగుణంగా తెలంగాణ అసెంబ్లీలో కూడా బీసీ రిజర్వేషన్లపై తీర్మానం చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల వచ్చే వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే విజయశాంతి అన్నారు. బుధవారం (ఏప్రిల్2) ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర బీసీ పోరు గర్జన నిర్వహించారు. బీసి బిల్లుకు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వంతో కలసి కొట్లాడేందుకు సిద్దంగా ఉన్నామని డీఎంకే,ఎన్సీపీలు ప్రకటించాయి.

**తెలంగాణ, తమిళనాడు కలిసి కొట్లాడుతాం: కనిమొళి....**

బీసీ రిజర్వేషన్లకు తమ పార్టీ సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్లు డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్ధతు ఇస్తున్నామని, ఈ విషయంలో తెలంగాణకు ఎల్లవేళలా మద్ధతు ఉంటుందని అన్నారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సంతోషం.. కేంద్ర పదవుల్లో బీసీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని అన్నారు. అందుకోసం దేశవ్యాప్త కులగణన జరపి బీసీలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.




హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలపై కసరత్తు మొదలు పెట్టింది. ఆ పార్టీ చీఫ్ , మాజీ సీఎం కేసీఆర్ కొన్ని రోజుల నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ లో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇవాళ ఏప్రిల్ 2న సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ సమావేశం ముగిసింది. ఏప్రిల్ 27న వరంగల్ లో జరగనున్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు, మహాసభపై సమావేశంలో చర్చించారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు జరుపుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు కేసీఆర్. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలి వచ్చేలా ప్లాన్ చేసుకోవాలని ఆదేశించారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలన్నారు. మహా సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ సమావేశానికి కేసీఆర్ తో పాటు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు , సునీతా లక్ష్మారెడ్డి, పద్మాదేవేందర్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, గంపగోవర్ధన్, గణేష్ బిగాల గుప్త, జాజుల సురేందర్ పలువురు మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఏప్రిల్ 1న ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ భేటీ అయిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై నేతలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం తెలంగాణ ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారని.. ప్రజలు స్వచ్ఛందంగా బహిరంగ సభకు తరలివస్తారని అన్నారు. సభకు వచ్చే జనానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని నేతలను ఆదేశించారు.




దిల్లీ: ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా తగిన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టులో ఇటీవల భారాస నేతలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిశాయి. తాజాగా స్పీకర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవు. ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశముంటుంది. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయమే. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదు" అని ముకుల్ రోహత్గీ వాదించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడమో.. ఆదేశించడమో చేయలేమా అని ప్రశ్నించారు. అనంతరం రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని.. కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముకుల్ రోహత్గీ వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని చెప్పారు. నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా? అని ప్రశ్నించారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ అన్నారు. "2024 మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారు" అని కోర్టుకు తెలిపారు.




## సీఎం రేవంత్ వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ : ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీలు మారినా ఉప ఎన్నికలు రావు అని రేవంత్ చేసిన వ్యాఖ్యలను బుధవారం విచారణలో ప్రత్యేకంగా ప్రస్తావించిన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలే చేసింది. పవిత్రమైన చట్టసభలో ఈ వ్యాఖ్యలు చేయడం... రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ను సీఎం హోదాలో ఉన్న వ్యక్తి అపహాస్యం చేయడం కిందకే వస్తుంది. ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేయకుండా సీఎంకు హితవు చెప్పండి. ఎట్టిపరిస్థితుల్లో ఈ తరహా వ్యాఖ్యలను ఉపేక్షించబోం. అవసరమైతే కోర్టు ధిక్కారంగా భావించాల్సి వస్తుంది" అని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఉద్దేశించి జస్టిస్ గవాయ్ అన్నారు. మేం అన్నీ ఆలోచించే కోర్టు ధిక్కార నోటీసులు ఇస్తున్నాం. అంతమాత్రాన మాకు అధికారాలు లేవని కాదు. అసెంబ్లీలో నాయకులు చేసే ప్రకటనలకు ఒక విలువ ఉంటుంది.

అసెంబ్లీలో మాట్లాడే అంశాలను కోర్టులు కూడా తీసుకుంటాయి అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గత బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీఎం రేవంత్ ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని, పార్టీ మారిన ఎమ్మెల్యేలెవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. "వచ్చే వారమే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ నేతలు ఊదరగొడుతున్నారు. కానీ.. ఎట్టి పరిస్థితుల్లోనూ రావు. గత బీఆర్ఎస్ హయాంలో ఉన్న రాజ్యాంగమే ఇప్పుడు కూడా ఉంది. స్పీకర్ వ్యవస్థ, చట్టం అవే ఉన్నాయి. ఏవీ మారలేదు. అలాంటప్పుడు అప్పుడు పార్టీలు మారిన నేతల విషయంలో రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని వ్యాఖ్యానించారు.

## తెలంగాణ సచివాలయం వద్ద ఉద్రిక్తత .. భాజపా మహిళా నేతల అరెస్టు

హైదరాబాద్: తెలంగాణ సచివాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. సెక్రటేరియట్ ముట్టడికి యత్నించిన భాజపా మహిళా మోర్చా నేతలను సౌత్ గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, మహిళలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు మహిళలను అడ్డుకుని స్థానిక ఠాణాలకు తరలించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారాలకు సంబంధించి నిరసనగా భాజపా మహిళా మోర్చా సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చింది. మరోవైపు కంచ గచ్చిబౌలి భూవివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.



# ప్రతి ఒక్కరి కంటా వెలుగు నిండాలి


## - అంధత్వ నివారణ వారోత్సవాల సందర్భంగా




భారత దేశంలో ఏటా ఏప్రిల్ 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించబడే అంధత్వ నివారణ వారోత్సవాలు, దేశ ప్రజలందరి దృష్టిని ఒక ముఖ్యమైన ప్రజా ఆరోగ్య సమస్య వైపు మరల్చే ప్రయత్నం. అంధత్వం యొక్క తీవ్రతను, దాని నివారణకు గల మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్నెస్, మరియు నేషనల్ సొసైటీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ వంటి అంతర్జాతీయ మరియు జాతీయ సంస్థలు ఈ కార్యక్రమాలను సమన్వయపరుస్తూ, అంధత్వ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే దాదాపు 2.2 బిలియన్ మంది ప్రజలు ఏదో ఒక రూపంలో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో చాలా మందికి సరైన సమయంలో చికిత్స అందిస్తే నయం చేయగల సమస్యలే ఉండటం గమనార్హం. కానీ, సరైన అవగాహన లేకపోవడం, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల ఈ సమస్యలు ముదిరి అంధత్వానికి దారితీస్తున్నాయి. భారతదేశంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. దాదాపు 43 మిలియన్ మంది దృష్టి లోపంతో బాధపడుతుండగా, వీరిలో 90% మందికి నివారించ దగిన సమస్యలే ఉండటం విచారకరం. అంధత్వ నివారణ వారోత్సవాలు కేవలం ఒక లాంఛనప్రాయ కార్యక్రమం కాదు. ఇది ప్రజల్లో కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంచడానికి ఒక గొప్ప అవకాశం. సకాలంలో కంటి పరీక్షలు చేయించుకోవడం యొక్క ప్రాముఖ్యతను, కళ్లను సురక్షితంగా ఉంచుకోవాల్సిన అలవాట్లను ఈ వారం సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేస్తారు. దేశవ్యాప్తంగా ఉచిత కంటి పరీక్షల శిబిరాలు ఏర్పాటు చేయడం, కంటి ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించడం, ప్రజల్లో చైతన్యం నింపే ర్యాలీలు చేపట్టడం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. అంతేకాకుండా, ప్రజారోగ్య ప్రదర్శనల ద్వారా అంధత్వ నివారణ మరియు చికిత్సా పద్ధతులను, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞాన పరిష్కారాలను పరిచయం చేస్తారు. ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ సంస్థలతో పాటు, %చీ+పా%లు మరియు ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం వహిస్తాయి. భారత ప్రభుత్వం 1976లోనే జాతీయ అంధత్వ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ఇది 100% కేంద్ర ప్రభుత్వ నిధులతో కొనసాగుతున్న ఒక ముఖ్యమైన పథకం. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం 2025 నాటికి దేశంలో అంధత్వం యొక్క ప్రాబల్యాన్ని 0.3%కి తగ్గించడం. దీని కోసం ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది. కంటి శస్త్రచికిత్సలు అందుబాటులోకి తేవడం, కంటి వైద్య నిపుణులను తయారు చేయడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలు ఈ పథకం కింద కొనసాగుతున్నాయి. అంధత్వ నివారణ వారోత్సవాలు మనందరికీ ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తున్నాయి. కంటి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా, చిన్న సమస్య వచ్చినప్పుడే వైద్యులను సంప్రదించడం చాలా అవసరం. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా అంధత్వాన్ని నివారించవచ్చు. ఈ వారోత్సవాలు కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచడంలోనూ, ప్రతి ఒక్కరికీ స్పష్టమైన చూపును అందించాలనే లక్ష్యాన్ని చేరుకోవడంలోనూ ఒక కీలకమైన పాత్ర పోషిస్తాయి. రేపటి తరం అంధత్వ రహిత భారతదేశంలో జీవించేలా మనవంతు కృషి చేద్దాం. కంటి సమస్యలను ముందుగానే గుర్తించి, సరైన నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా మన జీవితాల్లో వెలుగు నింపుకుందాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...**
**9440595494**

# భారతీ తీర్థ మాశ్రయే - చైత్ర శుద్ధ షష్ఠి భారతీ తీర్థ స్వామి వర్ధంతి



**భారతీ కరుణా పాత్రం భారతీ పద భూషణం !**
**భారతీ పదమారూఢం భారతీ తీర్థ మాశ్రయే !!**

అద్వైత మత స్థాపనాచార్యులైన ఆది శంకరులు తూర్పున జగన్నాథంలో "గోవర్ధన మఠం" పశ్చిమాన ద్వారకలో "శారదా మఠం", ఉత్తరాన కేదారంలో జ్యోతిర్మఠం", దక్షిణాన శృంగేరి యందు "శృంగగిరి మఠం" స్థాపించి మత కార్యనిర్వహణార్థం దేశం నలు చెరుగులా సంచరించి అద్వైత తత్వాన్ని వివరించి, దిగ్విజయ యాత్ర కొన సాగించారు. దుష్టాచారాలను నశింప చేసేందుకే కైలాస నాథుడే ఆది శంకరుని రూపంలో అవతరించారని "శివన్యాసం" స్పష్టపరుస్తున్నది. ఆదిశంకరులు స్థాపించిన శృంగగిరి మఠానికి 1989 నుండి తంగిరాల సీతారామ ఆంజనేయులు 38వ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి కాగా, అయన ఉత్తరాధికారిగా కుప్పా వేంకటేశ్వర ప్రసాద శర్మ "విధుశేఖర భారతీ తీర్థ స్వామి"గా 23వ జనవరి 2015న నియమింప బడి జైత్ర యాత్రలు కొనసాగి స్తున్నారు. కర్ణాటక రాష్ట్రం జిల్లాలోని శ్రీశృంగేరీ శారదాపీఠం అధిపతిగా 36వ జగద్గురుగా శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి ఆదిశంకరుల లక్ష్య సాధన పరంపరను కొనసాగి స్తున్నారు. మోములో ప్రశాంతత, కన్నులలో కరుణ, పలుకులో నిరంతర ప్రసన్నతతో మహా స్వామి అనుగ్రహ భాషణం చేస్తుంటే అమృతపు జల్లు కురిసినట్లనిపిస్తుంది. గుంటూరు జిల్లా, పల్నాడు ప్రాంతంలో నాగులేరు నదీ తీరాన ఉన్న అలుగు మల్లిపాడు గ్రామంలో వైదికాచార కుటుంబంలో కృష్ణ యజుః శాఖీయులు, ఆపస్తంబ సూత్రులు, కుత్సస గోత్రులు తంగిరాల వేంకటేశ్వరావధాని, అనంత లక్ష్మమ్మ దంపతులకు 1951 ఏప్రిల్ 11న స్వామివారు శ్రీ ఖరనామ సంవత్సరం చైత్ర శుద్ధ షష్ఠి నాడు జన్మించారు. వేదాధ్యయనం తండ్రి వద్ద ప్రారంభించి, తరువాతి కాలంలో ప్రతాపగిరి శివరామశాస్త్రి వద్ద సంస్కృతాంధ్రాల్ని నేర్చుకున్నారు. చిన్నతనంలోనే సంస్కృతంలో మంచి ప్రావీణ్యం గడించి విద్వాంసుల మన్ననలు పొందారు. ఏకసంథాగ్రాహియై సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యకంలను అభ్యసించి జిల్లా వేద ప్రవర్థక విద్వత్పరిషత్తు వారి వేద పరీక్షలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1961 సంవత్సరంలో శ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి దర్శన సమయంలో భారతీ తీర్థ సంస్కృత భాషను తిలకించి విశిష్ట పురస్కారం ఇచ్చారు. మహాస్వామి వారు ఉజ్జయినిలో, చాతుర్మాస్య వ్రతం జరుపుచుండగా అక్కడకు చేరిన సీతారామాంజనేయులు తనను శిష్యునిగా స్వీకరించమని ప్రార్థించారు. మహాస్వామి అనుగ్రహంతో స్వామివారి శిష్యునిగా ఏడెనిమిది సంవత్సరాల్లో కృష్ణయజుర్వేదాలు, న్యాయ, వ్యాకరణ, పూర్వోత్తర, మీమాంసాది శాస్త్రాలలో పరిపూర్ణ పాండిత్యం గడించారు. మేధాశక్తిని, సత్ప్రవర్తనను, శాస్త్ర పాండిత్యంలను పరీక్షించుచున్న పీఠాధిపతులు ఆయన మీద వాత్సల్యం కలిగి శ్రీ శారదాదేవి అనుమతితో శ్రీ శృంగేరి శంకర పీఠానికి ఉత్తరాధిపతిగా నియమించవలెనని ఆనంద నామ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి (1974 నవంబరు 11 న) నాడు నిర్ణయించారు. ఆనాడు వేలాది భక్తుల సమక్షంలో వారికి సన్యాసాశ్రమం అనుగ్రహించి "శ్రీ భారతీ తీర్థ" అనే ఆశ్రమ నామధేయం ఇచ్చారు. అభినవ విద్యాతీర్థ మహాస్వామి వారు 1989 సెప్టెంబరు 21న బ్రాహ్మీ భావంను పొందారు. ఆ తరువాత భారతీ తీర్థ మహాస్వామి శుక్ల నామ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పంచమి గురువారం 1989 అక్టోబరు 19న 36 వ జగద్గురు శంకరాచార్యగా పీఠాధిపతులు అయినారు. నాటినుండి ధార్మిక కార్యానురక్తులైన భక్తుల అభ్యర్ధనలను మన్నించి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాలలో విజయ యాత్ర జరిపి భక్తులను అనుగ్రహి స్తూ వచ్చారు. ప్రస్తుతం భారతీ తీర్థులవారు పీఠాధిపతి కాగా, శ్రీ విధుశేఖర భారతీ స్వామి వారు ఉత్తరాధికారిగా ఉన్నారు. ఆది శంకరుల ఆశయాలను సఫలం చేయడమే జీవిత పరమ లక్ష్యంగా, పరమాచార్య... శృంగేరిలో, చుట్టుపక్కల నివసించే వారికి వైద్యసౌకర్యాలు కల్పించాల నే సంకల్పంతో తమ గురువులు స్థాపించిన శారదా ధన్వంతరీ వైద్యశాల అన్ని విధాల అత్యాధునికమైన వైద్యశాల అయ్యేటట్లు చేశారు. శృంగేరికి వచ్చే భక్తులకు, యాత్రీకులందరికీ ప్రసాద రూపంగా ఉచిత భోజన వ్యవస్థను ఏర్పాటు చేయించారు. మఠాన్ని కేవలం ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలను కూడా వేదికగా తీర్చిదిద్దారు. ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు ఆపన్నులను ఆదుకోవటమే పరమావధిగా పాటుపడుతున్నారు. శృంగేరీ పీఠం దేశం నలుమూలలా శతాధిక శాఖలతో విస్తరించడం విశేషం. బాలలు, యువత క్రమశిక్షణను ఎప్పుడూ కోల్పోకూడదనీ, స్వధర్మాన్ని నిలబెట్టుకోవడం వల్లనే సనాతన ధర్మం పదికాలాల పాటు నిలబడుతుందంటారు. యువత ఎప్పుడూ అదుపు తప్పి ప్రవర్తించ కూడదనీ, బాల్యంలోనే బీజాలు పడాలంటారు. పెద్దలు పిల్లలకు నైతిక, పౌరాణిక కథలను చెప్పడం, వారికి మన దేశ ఘన వారసత్వాన్ని, సాంస్కృతిక విలువలను బోధించడం వల్ల ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాలు రక్షింప బడాలంటారు మహాస్వామి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కోటీశ్వరుడి 140 కి.మీ.ల పాదయాత్ర కథ



భారతదేశంలో అత్యంత సంపన్నమైన కుటుంబాల్లో ఒకటి అంబానీ ఫ్యామిలీ. వ్యాపార దిగ్గజం ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. అయితే ఈసారి ఆయన ఒక అనూహ్యమైన విషయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఎండకన్నెరుగని జీవితాన్ని గడిపే అనంత్ అంబానీ ఇప్పుడు ఏకంగా 140 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేస్తున్నారు. గుజరాత్‌లోని జామ్ నగర్ నుంచి ప్రఖ్యాత కృష్ణ క్షేత్రం ద్వారకకు ఆయన కాలినడకన ప్రయాణిస్తున్నారు. ఈ పాదయాత్రకు సంబంధించిన విషయాలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఒకవైపు ఆయన చేస్తున్న ఈ సాహసానికి అందరూ ఆశ్చర్యపోతుంటే.. మరోవైపు ఎందుకు ఆయన ఇంత కష్టమైన ప్రయాణాన్ని ఎంచుకున్నారనే ప్రశ్న అందరి మనస్సుల్లో మెదులుతోంది.

**-రాత్రిపూట మాత్రమే పాదయాత్ర.. ప్రభుత్వ సూచనలు!...** అనంత్ అంబానీ పాదయాత్ర సాఫీగా సాగేందుకు ప్రభుత్వం కూడా తగిన ఏర్పాట్లు చేసింది. జనాలు రద్దీగా ఉండే సమయాల్లో ఆయన నడవడం లేదు. కేవలం రాత్రి 11 గంటల తర్వాత నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే ఆయన పాదయాత్ర చేస్తున్నారు. దీనికి ముఖ్య కారణం ఆయన వ్యక్తిగత భద్రతను కాపాడటం.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటం. గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అనంత్ అంబానీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన యాత్రను కొనసాగిస్తున్నారు.

**-ఎందుకీ పాదయాత్ర? అసలు కారణం ఇదే!...** అయితే అనంత్ అంబానీ ఈ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారనే విషయంపై చాలా మందికి స్పష్టత లేదు. కానీ ఇప్పుడు దీనికి సంబంధించిన అసలు కారణం బయటకొచ్చింది. ఈ నెల 10న అనంత్ అంబానీ తన 30వ పుట్టినరోజును జరుపుకోనున్నారు.

ఈ సందర్భంగా ఆయన ద్వారక చేరుకుని అక్కడి కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకే ఆయన జామ్ నగర్ నుంచి ద్వారక వరకు 140 కిలోమీటర్ల దూరాన్ని కాలినడకన చేరుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**-అనంత్ అంబానీ గురించి కొన్ని విశేషాలు..** అనంత్ అంబానీ గురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఆయన ముఖేష్ అంబానీ కుమారుడు. ప్రస్తుతం జియోతో సహా రిలయెన్స్‌కు చెందిన పలు కంపెనీల్లో డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఆయన దేశంలోనే అత్యంత ఖరీదైన వివాహం ద్వారా సెన్సేషన్ అయ్యారు. అంతేకాదు ప్రధాని నరేంద్ర మోదీని తన ప్రైవేట్ జూ 'వంతార'కు ఆహ్వానించి ఆయనతో ఒక రోజంతా గడిపారు. ఇప్పుడు తన పాదయాత్రతో మరోసారి వార్తల్లో నిలిచారు.

**-ద్వారకలో పుట్టినరోజు వేడుకలు..** అనంత్ అంబానీకి జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉంది. ఇంత భద్రత ఉన్న వ్యక్తులు సాధారణంగా రాజకీయ పాదయాత్రలు చేస్తుంటారు. కానీ అనంత్ అంబానీ రాజకీయ నాయకుడు కాదు. ఆయన చేస్తున్నది ఒక ఆధ్యాత్మిక పాదయాత్ర. తన 30వ పుట్టినరోజు నాటికి ద్వారక చేరుకోవాలనే సంకల్పంతో ఆయన ఈ యాత్రను ప్రారంభించారు. ఏప్రిల్ 10న ఆయన పుట్టినరోజు కావడంతో ఆ రోజు ద్వారకలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

**-రాత్రిపూట మాత్రమే యాత్ర.. ఎందుకంటే?...** మార్చి 27న అనంత్ అంబానీ తన పాదయాత్రను ప్రారంభించారు. జామ్ నగర్ నుంచి ద్వారకకు ఉన్న 140 కిలోమీటర్ల దూరాన్ని ఆయన రోజుకు 15 నుంచి 20 కిలోమీటర్ల మేర నడుస్తున్నారు. జడ్ ప్లస్ భద్రత ఉన్న వ్యక్తి రోడ్డుపైకి వచ్చి యాత్ర చేస్తే ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉంది. ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకే ఆయన రాత్రి సమయంలో మాత్రమే యాత్ర చేస్తున్నారు. తెల్లవారుజామున తన యాత్రను ముగించి పగటిపూట విశ్రాంతి తీసుకుంటున్నారు.

**-మందీమార్బలం.. భద్రతా సిబ్బందితో కలిసి..** అనంత్ అంబానీ వెంట దాదాపు 100 మంది సిబ్బంది ఈ యాత్రలో పాల్గొంటున్నారు. వారిలో కొందరు ఆయనకు కావాల్సిన ఏర్పాట్లు చూసుకుంటుంటే.. మరికొందరు వాహనాల్లో ఆయన్ను అనుసరిస్తున్నారు. ఇంకొందరు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది. దారి పొడవునా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీరంతా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**-భార్య కూడా ద్వారకకు..** ఏప్రిల్ 8 నాటికి అనంత్ అంబానీ భార్య రాధికా మర్చంట్ కూడా ద్వారక చేరుకుంటారు. ఆ తర్వాత ఒకట్రెండు రోజుల్లో అనంత్ అంబానీ కూడా పాదయాత్ర ద్వారా అక్కడికి చేరుకుంటారు. ఏప్రిల్ 10న అనంత్ అంబానీ పుట్టినరోజు సందర్భంగా ఇద్దరూ కలిసి ద్వారకలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అధిక బరువు సమస్య, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ అనంత్ అంబానీ ప్రతిరోజూ 10 నుంచి 15 కిలోమీటర్లు నడుస్తుండటం నిజంగా ఆశ్చర్యకరమని నెటిజన్లు అంటున్నారు. ఆయన సంకల్ప శక్తికి అందరూ హ్యాట్సాఫ్ చెబుతున్నారు. మొత్తానికి అనంత్ అంబానీ తన 30వ పుట్టినరోజును ద్వారకలో జరుపుకోవాలనే తపనతో చేస్తున్న ఈ పాదయాత్ర ఇప్పుడు దేశవ్యాప్తంగా ఒక ఆసక్తికరమైన అంశంగా మారింది.

# ఇప్పుడు రోహిత్ పై వేటు..

## నీతా అంబానీ చిట్ చాట్ ఉద్దేశమిదే?

టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్ మళ్లీ తెరపైకి వచ్చింది. మొన్నటికి మొన్న ఆస్ట్రేలియాతో బోర్డర్ గావస్కర్ టెస్టు సిరీస్ లో దారుణ ఫెయిల్యూర్.. ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేస్తారా? అన్న అనుమానాలు.. ఇప్పుడు ఐపీఎల్ లో దారుణ ప్రదర్శన.. దీంతో రోహిత్ అవసరం ఇంకా ఉందా? అంటూ కొన్ని వర్గాల నుంచి ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఓనర్స్ కు ప్రశ్నలు వస్తున్నాయి. ముంబై ఐదుసార్లు చాంపియన్ గా నిలవడంలో కచ్చితంగా రోహిత్ శర్మదే ప్రధాన పాత్ర. అయినప్పటికీ గత సీజన్ ముందు అతడిని తప్పించి అనూహ్యంగా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను గుజరాత్ నుంచి తీసుకొచ్చి కెప్టెన్ ను చేశారు. ఆ సీజన్ లోనే కాదు.. ఈ సీజన్ లోనూ ముంబై ప్రదర్శన బాగోలేదు. ఇక రోహిత్ శర్మ ఫామ్ మరింత ఆందోళనకరంగా మారుతోంది. మరొక్క నెల రోజుల్లో 38 ఏళ్లు




నిండనున్న రోహిత్ కుర్రాళ్ల గేమ్ అయిన టి20ల్లో సత్తా చాటలేకపోతున్నాడు. 0, 8, 13.. ఇవీ గత మూడు మ్యాచ్ లలో రోహిత్ స్కోర్లు. సోమవారం కోల్ కతాతో మ్యాచ్ లో ఆండ్రీ రస్సెల్ వంటి పార్ట్ టైమ్ బౌలర్ చేతిలో ఔటయ్యాడు. ఈ మ్యాచ్ లో ముంబై గెలిచింది కాబట్టి సరిపోయింది.

ఒకవేళ ఓడిపోయి ఉంటే గనుక ముందుగా రోహిత్ పై విమర్శలు వెల్లువెత్తేవి. కాగా, మ్యాచ్ అనంతరం రోహిత్ తో ముంబై ఓనర్ నీతా అంబానీ సంభాషిస్తున్న వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. గత మూడు మ్యాచ్ లలో 21 పరుగులే చేసిన రోహిత్ తో నీతా అంత తీవ్రంగా చర్చించడాన్ని బట్టి చూస్తే వ్యవహారం సీరియస్ అనే అభిమానులు భావిస్తున్నారు. ఐపీఎల్ అంటే ఆట-వ్యాపారం. ఇక్కడ ఆడినంత కాలమే గౌరవం. పైగా ఫ్రాంచైజీల ఓనర్లు ఫక్తు వ్యాపారులు.

నిరుడు కేఎల్ రాహుల్-సంజీవ్ గోయెంకా ఇలాగే మ్యాచ్ అనంతరం తీవ్రంగా చర్చించుకున్నారు. తర్వాత రాహుల్ ఆ జట్టుకు దూరమయ్యాడు. మరి ఇప్పుడు రోహిత్-నీతా అంబానీ సీరియస్ డిస్కషన్ సారాంశం కూడా ఇదేనా?

# ఎంఐ టీమ్ బస్సులో 'జాస్మిన్' ఎందుకు హార్దిక్ పాండ్యా?

గత కొంతకాలంగా టీమిండియా ఆల్ రౌండర్, ముంబై ఇండియన్స్ ఐపీఎల్ టీమ్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా గర్ల్ ఫ్రెండ్ అని ప్రచారం జరుగుతున్న జాస్మిన్ వాలియా తాజాగా.. ముంబై ఇండియన్స్ - కోల్ కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో సందడి చేశారు. దీంతో... హార్దిక్ తో జాస్మిన్ డేటింగ్ వార్తలకు మరోసారి బలం చేకూరినట్లయ్యింది! అవును... ప్రముఖ బ్రిటీష్ - ఇండియా గాయని జాస్మిన్ వాలియా సోమవార్రం రాత్రి ముంబైలో కేకేఆర్ తో ఎంఐ కి జరిగిన మ్యాచ్ లో సందడి చేశారు. ఈ సమయంలో మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఎంఐ టీమ్ ని ఫుల్ గా ప్రోత్సహించిన ఆమె.. మ్యాచ్ అనంతరం టీమ్ మెంబర్స్ తో పాటు బస్సు ఎక్కుతూ కనిపించడం వైరల్ గా మారింది. వాస్తవానికి జాస్మిన్ వాలియా మ్యాచ్ సమయంలో కనిపించడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల దుబాయ్



లో పాక్-భారత్ మధ్య జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ సమయంలోనూ ఆమె కనిపించి సందడి చేశారు. ఇప్పుడు తాజాగా ఏకంగా ముంబై ఇండియన్స్ జట్టు బస్సులో ఎక్కడంతో హార్ధిక్ తో డేటింగ్ పుకార్లు మరోసారి షికారు చేస్తున్నాయి. కాగా... గత ఏడాది జూలై 20న తాము విడిపోతున్నట్లు హార్దిక్ పాండ్యా, నటాషా స్టాంకోవిక్ తమ తమ సోషల్ మీడియా అకౌంట్స్ లో సంయుక్త ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాము 4 ఏళ్లు కలిసి ఉన్న తర్వాత విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు నాడు ఇరువురూ ప్రకటించారు. మరోపక్క వరుసగా రెండు ఓటముల తర్వాత ఐపీఎల్ తాజా సీజన్ లో ముంబై ఇండియన్స్ జట్టు బోణీ కొట్టింది. కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ లో 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇందులో భాగంగా.. తొలుత కేకేఆర్ ను 116 పరుగులకే కట్టిన చేసిన ముంబై.. 12.5 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది.

# చురకలు

## సంపాదకీయం

### కాపులకు ఒక పార్టీ ఉండాల్సిందేనా ?


ఏపీలో మళ్ళీ రాజకీయ మధనం సాగుతోంది. అది సామాజిక రాజకీయ మధనంగా ఉంది. నిజం చెప్పాలంటే దేశంలోని అనేక రాష్ట్రాల్లో రాజకీయం ఒక ఎత్తు. ఏపీలో రాజకీయం మరో ఎత్తు. ఏపీలో పాలిటిక్స్ అంటేనే కులాల సంకుల సమరం. లెక్కలు అన్నీ ఇక్కడ పక్కగా ఉంటాయి. తేడా వస్తే అంతా రివర్స్ కూడా అవుతుంది మరి. ఉమ్మడి ఏపీలో కానీ విభజన ఏపీలో కానీ రాజకీయం ఎపుడూ హాట్ గానే సాగుతూ వస్తోంది. ఇక చూస్తే కనుక ఉమ్మడి ఏపీని అనేక మంది సీఎంలు పాలించారు. కానీ వారిలో కాపుల నుంచి ఒక్కరూ ప్రాతినిధ్యం అయితే లేదు. నిజానికి ఏపీలో కాపులు చాలా డామినేటింగ్ రోల్ ప్లే చేస్తూ ఉంటారు. జనాభా పరంగా చూసినా వారు చాలా చోట్ల బలంగా ఉంటారు. సుమారు డెబ్బై అయిదు అసెంబ్లీ నియోజకవర్గాలలో వారి పాత్ర ప్రత్యక్షంగా పరోక్షంగా కీలకంగా ఉంటుంది. అంటే గెలుపు ఓటములను తీవ్రంగా ప్రభావితం చేస్తారన్న మాట. అంతవరకూ ఎందుకు చరిత్ర ఒక్కసారి తిరగేస్తే చాలు కాపులు మద్దతు ఇచ్చిన పార్టీలే గెలిచాయి. వారి ఆగ్రహానికి గురి అయినవి ఓటమి బాట పట్టాయి. మరీ ముఖ్యంగా 1983 నుంచి చూస్తే కాపుల పాత్ర ఏపీలో అతి కీలకంగా మారింది. వారు ఏ పార్టీతో కలసి నడిస్తే వారికి అధికారం దక్కి తీరుతుంది అన్నది రుజువు అయింది. 1983, 1985లలో టీడీపీతో నడచిన కాపులు 1989లో కాంగ్రెస్ వెంట ఉండి గెలిపించారు. అలాగే 1994, 1999లలో టీడీపీ వైపు ఉన్నారు. 2004లో కాంగ్రెస్ ని గెలిపించిన కాపులు 2009లో ప్రజారాజ్యం వెంట సాగారు. 2014లో తిరిగి టీడీపీ బీజేపీ కాంబోని ఏపీలో గెలిపించడంలో వారిది ముఖ్య పాత్ర. ఇక 2019లో వైసీపీ గెలుపు వెనక కాపులది అతి ప్రధాన పాత్ర. 2024 వచ్చేసరికి సీన్ రివర్స్ అయింది. కూటమిని గెలిపించిన కాపులు వైసీపీని గద్దె దించేశారు. ఇవన్నీ కూడా కాపుల రాజకీయ ప్రాబల్యాన్ని పలుకుబడిని తెలియచేస్తాయి. ఇదిలా ఉంటే ఏపీలో కాపులకు అధికారం మాత్రం అందరి పండు అవుతోంది. విభజన ఏపీలో వారు సులువుగా అధికారం అందుకోవచ్చు. మ్యాజిక్ ఫిగర్ 88 అయిన చోట 75 అసెంబ్లీ నియోజకవర్గాలలో రాజకీయ పలుకుబడి కలిగిన కాపులకు సీఎం పీఠం దక్కడం ఒక విధంగా ఈజీనే అని అంటారు. కానీ ఏపీలో చూస్తే రాజకీయ సమీకరణలు మాత్రం వారిని ఇబ్బంది పెడుతున్నాయి. ఏదో ఒక ప్రధాన పార్టీకి మద్దతుగా ఉంటూ పదవులు అందుకోవడమే తప్పించి ముఖ్యమంత్రి సీటుని తాము దక్కించుకోలేకపోతున్నామన్న వేదన వారిలో ఉంది. ఈ రోజు ఏపీలో కూటమి గెలుపు వెనక కాపులు ఉన్నారు. కానీ ఉప ముఖ్యమంత్రి పదవి జనసేనకు దక్కింది. ఈ ఉప ముఖ్యమంత్రి పదవి కోసం కాపులు ఆలోచించడంలేదు ఈ పదవి వైసీపీ టీడీపీలు గతంలోనూ ఇచ్చి ఉన్నాయి అని గుర్తు చేస్తున్నారు. కాపులు రాజకీయంగా కీలకం అయినపుడు గెలుపులో వారి పాత్ర అతి ముఖ్యమైనపుడు రాజకీయ బేరసారాలుతో సీఎం సీటుని సాధించుకోవాలన్నదే కాపు పెద్దల ఆలోచన. జనసేన అయితే సీఎం చంద్రబాబుని మరింతకాలం ఆ పదవిలో చూడాలని అనుకుంటోంది. ఆయనను సత్తా ఉన్న నాయకుడిగా చూస్తోంది. ఆయన వల్లనే ఏపీ అభివృద్ధి అని భావిస్తోంది. దాంతో ఏపీలో కాపులు అందలం ఎక్కాలీ అంటే మరో దశాబ్దన్నర కాలం వేచి చూడాలా అన్న చర్చ కూడా వస్తోంది. ఇక రాజకీయంగా చూసినా ఒకరిద్దరికి పదవులు ఇచ్చేస్తే మొత్తం సామాజిక వర్గం మేలు జరిగింది అన్న భావన సరికాదు అన్నది కూడా ఉంది. తాము కూడా ముఖ్యమంత్రులు కావాలని తమ హవా కొనసాగాలన్నదే కాపుల ఆలోచనగా చెబుతున్నారు. ఇంకో వైపు చూస్తే కాపులకు పదవులు అంటే జనసేనకు కోటా ఇచ్చేసి మిగిలిన సామాజిక వర్గాలకు టీడీపీలో సర్దుతున్న నేపథ్యం ఉంది. దాంతో టీడీపీలో కాపులు రగులుతున్నారు అన్న ప్రచారం కూడా సాగుతోంది. అలాగే వైసీపీలో కూడా కాపులు దారి తెన్నూ తెలియక ఉన్నారని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో వంగవీటి రంగా తనయుడిగా ఒక బలమైన సామాజిక వర్గానికి సంబంధించిన చరిష్మా టిక్ లీడర్ గా ఉన్న వంగవీటి రాధాకృష్ణ నేతృత్వంలో కాపుల కోసం కొత్త పార్టీ మొదలవుతుందా అన్న చర్చ అయితే ఉంది. మొదట ఇది పుకారుగా బయల్దేరినా ఇది ఇపుడు చర్చకు తావిస్తోంది. దాంతో మరో నాలుగేళ్ళలో ఏపీలో జరిగే ఎన్నికల లోగా ఈ పుకారు నిజమవుతుందని బలమైన రాజకీయ బీజం పడి కాపుల కోసం ఒక పార్టీగా ముందుకు వచ్చే చాన్స్ ఉందని అంటున్నారు అదే జరిగితే కనుక ఏపీలో రాజకీయ సమీకరణలు మొత్తం సామాజిక పరంగా మారిపోతాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఖగర్ తలపెట్టిన నరసంహారణాన్ని ఆపాలి..!

**(మొదటి పేజీ తరువాయి)**అంతర్గత భద్రత కోసం సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగ వ్యతిరేకం. కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి గానీ, ప్రకటించక గానీ స్వంత దేశ ప్రజలపై సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగపు మౌలిక భావనలకే వ్యతిరేకం. సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీ, పీడనలను సుస్థిరం చేయడం కోసమే, 'హిందూ రాష్ట్ర ఏర్పాటు కోసమే బీజేపీ పాలిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ఇతర రాజకీయ పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించ తలపెట్టిన 'వికసిత్ భారత్-హిందూరాష్ట్ర' ఎలా ఉంటుందనేది కగార్ యుద్ధం ద్వారా స్పష్టమవుతోంది. అది ఆదివాసుల, పేదల రక్తపుమడుగుల పునాదులపై నిర్మాణమవుతోంది. అది రేపు దేశంలోని రైతాంగపు భూముల్ని, ప్రాకృతిక వనరులను, మార్కెట్ ను, ప్రభుత్వ రంగ సంస్థలను దేశ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెడుతుంది. మతమైనారిటీలపై వివక్షతను రాజ్యాంగబద్ధం చేస్తుంది. సమాఖ్య వ్యవస్థను నాశనం చేసి నియంతృత్వ కేంద్ర ప్రభుత్వాన్ని (ఆటోక్రటిక్ యూనిటరీ స్టేట్ ను) నిర్మిస్తుంది. తూర్పు, మధ్యభారతంలో మా పార్టీ నాయకత్వంలో ఆదివాసులు, వారితోపాటు తరతరాలుగా నివాసముంటున్న గైరాదివాసీ పేద ప్రజానీకం తమ జల్, జంగల్, జమీన్ పై అధికారం కోసం, స్వయంపాలన (అటానమి) కోసం. తమ సంస్కృతి - సాంప్రదాయాల రక్షణ కోసం, తమ మాతృ భాషల రక్షణ కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం మొత్తంగా సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను కూలదోసి సమసమాజ స్థాపన కోసం పోరాడుతుంటే బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రజాపోరాటాలను నిర్మూలించడం కోసం తూర్పు, మధ్యభారతంలో కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీ, పీడనల నుండి దేశంలోని పీడిత ప్రజల, పీడిత సాంఘిక సముదాయాల, పీడితజాతుల విముక్తి కోసం మా పార్టీ పోరాడుతుంటే ఆ పోరాటాలను అణచివేయడానికి పట్టణాల్లో, మైదానాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయుధ పోలీసు బలగాల్ని, ఎన్ఐఏ లాంటి ఇంటలిజెన్స్ ఏజెన్సీలను ఉపయోగించి పోరాడే ప్రజానీకంపై దాడులు చేస్తున్నాయి. ప్రజాపక్ష మేధావులపై భీమాకోరేగావ్ కుట్ర కేసును మోపి జైళ్లో బంధించాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే, దేశంలోని సకల పీడిత ప్రజలపై, పీడిత సాంఘిక సముదాయాలపై, పీడిత జాతులపై సామ్రాజ్యవాదులు, దళారీ పెట్టుబడిదార్లు, భూస్వాములు సాగించే దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా మా పార్టీ పోరాడుతుంటే, ఈ దోపిడీ పాలకవర్గాల దోపిడీ, పీడనలను సుస్థిరం చేయడానికి బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రజలపై కగార్ పేరుతో యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. విప్లవోద్యమ ప్రాంతాల్లో ఆదివాసీ యువతి-యువకులను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకుని వారిచేతనే ఆదివాసులను హత్యలు చేయిస్తున్నాయి. ఈ స్థితిలో ప్రజల ప్రయోజనాల కోసం మేము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే. అందుకే శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదన చేస్తున్నాం. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలీ), ఒడిశా, ఝార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యకాండలను, నరసంహారాన్ని (జీనోసైడ్) ను నిలిపివేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలని ప్రతిపాదిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తే మేం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తాం. మేము చేస్తున్న ఈ ప్రతిపాదనల ఆధారంగా శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుక రావాలని శాంతి చర్చల కమిటీకి, దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు, ఆదివాసీ, దళిత సంఘాలకు, విద్యార్థి-యువజనులకు, పర్యావరణ కార్యకర్తలకు తదితరులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, నగరాల్లో, జిల్లా, తాలూకా కేంద్రాల్లో, యూనివర్సిటీల్లో ప్రచార క్యాంపెయిన్ ను చేపట్టాల్సిందిగా కోరుతున్నాం.

**అభయ్, అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# అసమాన యోధుడు జనరల్ మానెక్‌షాజి - ఏప్రిల్ 3...భారతీయ సైన్య మొదటి ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా జయంతి




ఆయన యుద్ధ వీరుడు. సాహస సైనికుడు. సమర్థ నాయకుడు. అయిదు యుద్ధాలలో పాల్గొని, తుపాకీ గుళ్ళు శరీరంలో దిగినా, విశ్రమించని పోరాట యోధుడు. పాకిస్తాన్ యుద్ధ విజయ సారథి. ఆయనే ధైర్య సాహసాలకు మారు పేరుగా నిలిచిన భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా. అయన పూర్తి పేరు శాం హోర్ముస్‌జీ ఫ్రేంజీ జెమ్‌షెడ్జీ మానెక్ షా (ఏప్రిల్ 3, 1914 - జూన్ 27, 2008). 1971లో పాకిస్తాన్తో యుద్ధంలో భారత్‌కు అతిపెద్ద సైనిక విజయాన్ని సాధించి పెట్టిన ఆయన బంగ్లాదేశ్ ఆవిర్భావానికి అద్యుడయ్యారు. 1914 ఏప్రిల్ 3వ తేదీన అమృతసర్ లోని పార్శీ దంపతులకు మానెక్‌షా జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుజరాత్ రాష్ట్రంలోని వల్సాద్ అనే చిన్న పట్టణం నుంచి అమృతసర్, పంజాబ్ రాష్ట్రంకు వలస వెళ్ళారు. అమృతసర్, నైనిటాల్‌లలో పాఠశాల విద్య పూర్తయ్యాక డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో క్యాడెట్‌గా తొలి బ్యాచ్‌లో మానెక్ షా చేరారు. 1934లో ఆయన సైన్యంలో రెండో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. జూన్ 7, 1969 న జనరల్ కుమార మంగళం నుండి 8వ సైనిక దళాల ప్రదానాదికారిగా బాధ్యతలు స్వీకరించి 15, జనవరి 1973 న పదవీ విరమణ చేసారు. బ్రిటిష్ పాలనా కాలం మొదలుకొని నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో సేవలు అందజేసిన శాం మానెక్‌షా- రెండవ ప్రపంచ యుద్ధంలోను, భారత స్వాతంత్ర్యానంతరం చైనా, పాకిస్థాన్‌లతో జరిగిన మూడు యుద్ధాల సందర్భంగాను ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధి కుశలత అమోఘమైనవి. రెండో ప్రపంచ యుద్ధం జరుగు తున్నప్పుడు జపాన్ ఆక్రమిత దళాలను తిప్పి కొట్టేందుకు ఉద్దేశించిన సైనిక విభాగం అధిపతిగా బర్మాలో ఆయన ప్రాణాలొడ్డి పోరాడారు. కడుపులోకి ఏడు గుళ్లు దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు ఇచ్చే అత్యున్నత పతకం 'మిలిటరీ క్రాస్'ను మృతులకు ప్రకటించ రాదన్నది నియమం. మానెక్‌షా బతికి బట్టకట్టక పోవచ్చునని భావించిన నాటి మేజర్ జనరల్ డి.టి.కోవన్, తన 'మిలిటరీ క్రాస్ రిబ్బన్'ను తక్షణం మానెక్‌షాకు ప్రదానం చేశారు. అదృష్టవశాత్తు మృత్యుముఖం లోంచి బయట పడిన మానెక్‌షా, మరోసారి బర్మాలో జపాన్ సైనికులను ఢీకొన్నారు. మళ్ళీ గాయ పడినప్పటికీ వెన్ను చూపలేదు. జపాన్ సైనికులు లొంగిపోయాక, 10 వేల మందికిపైగా యుద్ధ ఖైదీలకు పునరావాసం కల్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. 1947లో దేశవిభజన, 1947-48లో జమ్ము కాశ్మీర్‌లో సైనిక చర్యల సందర్భంగా ఆయన తన పోరాటపటిమను మరోమారు లోకానికి చాటి చెప్పారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం ఆయన వ్యూహ నైపుణ్యానికి, దీక్షాదక్షతలకు అద్దం పట్టింది. ఆ యుద్ధంలో పాక్ చిత్తుగా ఓడిపోవడమే కాదు, 45,000 మంది పాక్ సైనికులు, మరో 45,000 మంది పౌరులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. తరువాత బంగ్లా ఆవిర్భావానికి దోహద పడిన సిమ్లా అంగీకారం కుదర్చడంలోనూ ఆయనది కీలక భూమికే. ఆయన సమర్థ సారథ్యం దేశసైనిక దళాల్లో సరికొత్త విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1973 జనవరిలో మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి కల్పించి, ఆయనను సముచిత రీతిలో గౌరవించింది. 1971 ఆరంభంలో తూర్పు పాకిస్థాన్ నుంచి పెద్దయెత్తున శరణార్థులు భారత్‌లోకి వస్తున్న సమస్యపై ఆ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన క్యాబినెట్ సమావేశానికి త్రివిధ దళాధిపతుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మానెక్‌షానూ ఆహ్వానించారు. ఈ సమస్యని పరిష్కరించడానికి తక్షణం సైనికులని పంపాలన్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నిర్ణయాన్ని వాతావరణం అనుకూలంగా లేదన్న కారణముతో ఒప్పుకోకుండా, వెంటనే యుద్ధానికి దిగక తప్పదంటే మానసిక లేదా శారీరక అనారోగ్య కారణాలపై రాజీనామా చేయడానికీ తాను సిద్ధమే అనడం ద్వారా తన నాయకత్వ లక్షణాలని చాటిన ఈయన, తన సమర్థ వాదనతో క్యాబినెట్‌ను ఒప్పించి 1971 డిసెంబరులో, అన్ని విధాలా సానుకూల పరిస్థితుల్ని చూసుకొని పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించి, అద్భుత విజయం సాధించి చూపి తన నిర్ణయం ఎంత సరియినదో నిరూపించి వ్యూహ కర్తగా ఆయన చతురతను చాటిచెప్పిన వైనం అద్వితీయం. మీ యుద్ధ విమానాలు నాశనం చేశాం, మిమ్మల్నందరిని మా సైనికులు చుట్టూ ముట్టి వున్నారు. లొంగిపోక పోతే నిర్ధాక్షణ్యంగా చంపేస్తాం అంటూ పాకిస్తాను సైనికులని కఠినంగా హెచ్చరించి శత్రువులని లొంగదీసుకున్న గొప్ప తనం ఆయనకే సొంతం. శాం మానెక్‌షా గొప్ప వక్త కూడా. ముక్కు సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. భారత సమాజాన్ని నాయకత్వ కొరతే పట్టి పీడిస్తోందంటూ ఒక సందర్భంలో ధైర్యంగా దాపరికం లేకుండా చెప్పారు. అన్ని రంగాల్లో నాయకత్వ కొరతే దేశంలోని అస్తవ్యస్త పరిస్థితులకు కారణమని స్పష్టం చేశారు. వృత్తిపరమైన సామర్థ్యం, విజ్ఞానం, నిజాయతీ, నిష్పాక్షికత, ధైర్యం, విశ్వసనీయత, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత - ఇవీ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలని వివరించి, లక్షలమంది సైనికులకు, సైనికులుగా చేరాలనుకున్న వారికే కాకుండా సామాన్యులకి కూడా స్ఫూర్తిగా నిలిచారు. భారత్‌కు ఎన్నో విజయాలను అందించిన యుద్ధ సేనాని మానెక్ షా జూన్ 26, 2008 గురువారం అర్ధరాత్రి 94ఏళ్ల వయస్సులో మృతి చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ - ఏప్రిల్ 3... ఛత్రపతి శివాజీ వర్ధంతి



ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్థ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందూత్వంలో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది. 1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామాయణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతు డయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు. శివాజీ జాగీరులో రాంఝా గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది. దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరు కున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాపా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి- తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది. పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది. 1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహరాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నేళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోండ్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీ గడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగరాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్పై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# యువత లక్ష్యంగా సైన్స్ రీల్స్

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం సందడంతా రీల్స్‌దే. వినోదం పంచడమే కాదు.. వ్యాపార ప్రకటనలు, ప్రచారాల వరకు వీటిదే హవా. ప్రభుత్వాల వైఫల్యాలపై వ్యంగ్యాస్త్రాలు, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఏవైనా రీల్స్‌లోనే. పిల్లలు, కుర్రకారు మొదలు పెద్దల వరకు మొబైల్‌లో వీటి వీక్షణలో గంటల సమయం గడుపుతున్నారు. ఇంతటి జనాదరణ కలిగిన రీల్స్‌ను వినియోగించి సైన్స్‌ను జనంలోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని కేంద్ర పరిశోధన సంస్థలు సమాలోచనలు చేస్తున్నాయి.

నగరంలో తార్నాక నుంచి ఉప్పల్ వరకు సైన్స్ కారిడార్‌లో పలు కేంద్ర పరిశోధన సంస్థలు ఉన్నాయి. ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీడీఎఫ్‌డీ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు మీదుగా చంద్రాయణగుట్ట వరకు వెళ్తే డీఆర్‌డీవో ల్యాబ్‌లు ఉన్నాయి. ప్రజల పన్నులతో నడుస్తున్న ఈ సంస్థలు తమ పరిశోధనల గురించి ముఖ్యమైన వాటిని ఎక్స్‌లో పంచుకుంటున్నాయి. సీసీఎంబీ యూట్యూబ్ సిరీస్‌లు చేస్తోంది. సైన్స్‌పై కొత్తతరంలో ఆసక్తి పెంచడంతో పాటూ తమ చుట్టుపక్కల ఉన్న ప్రయోగశాలల్లో ఏమి చేస్తున్నారనే విషయాలను ప్రజలకు చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. కానీ ఇవి చాలా తక్కువ మందికే చేరుతున్నాయి. దీంతో కొన్ని సంస్థలు వినూత్న ఆలోచన చేస్తున్నాయి. సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు..ముఖ్యంగా యువత లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

**30 నుంచి 90 సెకన్లలో..**

గంటల తరబడి వీడియోలను చూసే వారి సంఖ్య తక్కువ. అందునా సైన్స్‌పై అంటే ఇంకా తక్కువ. అందుకే రీల్స్ చేసి సామాన్య జనానికి చేరువకావొచ్చన్న ఆలోచనలను పరిశోధన సంస్థలు చేస్తున్నాయి. రీల్స్‌ను 30 సెకన్లలో తీస్తారు. గరిష్ఠంగా 90 సెకన్లకు మించదు.




ఈ తక్కువ సమయంలోనే సూటిగా, సుత్తిలేకుండా పరిశోధనలతో సాధించిన విజయాలను చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫిల్మ్, టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ)తో చర్చిస్తున్నామని హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఆచార్య ఉల్లాస్ తెలిపారు.

**విజ్ఞాన సమాజం కోసం..**

సైంటిఫిక్ టెంపర్ ఉన్న సమాజం ఉండాలనేది మా ప్రయత్నం. సైన్స్‌లో చాలా ఆవిష్కరణలు సామాన్య మానవులకు చేరడం లేదు. ప్రస్తుతం సైన్స్ లిటరసీ ఒక సవాల్‌గా ఉంది. అక్షరజ్ఞానంతో ఆగిపోకుండా వైజ్ఞానిక అక్షరాస్యతను పెంపొందించాల్సి ఉంది. అప్పుడే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్ ప్రకారం సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం యువత సమాజంలో మూఢనమ్మకాలకు ఎక్కువ బలవుతున్నారు. వీరిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు రీల్స్ ఆలోచన వచ్చింది. ప్రస్తుతం యువత ఎక్కువగా ఇన్‌స్టాలోని రీల్స్ చూస్తున్నారు. తక్కువ నిడివితో రీల్స్ చేశాం. లక్షల సంఖ్యలో చూస్తున్నారు. జనంలోకి తీసుకెళ్లగలిగాం. స్పందన బాగుంది. ఈ తరానికి చేరేందుకు సంప్రదాయపద్ధతుల్లో సాధ్యం కాదు. కొత్త పద్ధతులను అన్వేషించాలి. రీల్స్ అలాంటివే. ఇంకా ఏమైనా ఉంటే కూడా ప్రయత్నించవచ్చు.
రమేశ్, అధ్యక్షుడు, విజ్ఞానదర్శిని

# సేవ ముసుగులో సైబర్ మాయగాళ్ల దందా

హైదరాబాద్ : సైబర్ మాయగాళ్లు ఏ అవకాశాన్ని వదలుకోవట్లేదు. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతిదాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పేద పిల్లలకు విద్యా బుద్ధులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రార్థనామందిరాలకు విరాళాలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఉచిత వైద్య చికిత్సలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకట్టుకుంటున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఇది నిజమనే ఉద్దేశంతో స్పందించి డబ్బులు నష్టపోతున్నారు. మరోవైపు విదేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కంపెనీలు, ట్రస్ట్‌లు భారత్‌లో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమైందంటూ ఫోన్ నంబర్లకు సందేశాలు, లింక్‌లు పంపుతున్నారు. వాటికి స్పందించిన వారి ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల లావాదేవీలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. తొలుత నమ్మకం కలిగించేందుకు రూ.5-10వేలు బాధితుల



ఖాతాల్లో జమ చేస్తున్నారు. పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసేందుకు ముందుగా పన్నులు చెల్లించాలంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు 5-6 కేసులు నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే లింక్‌లు, సేవ, విరాళాల పేరిట వచ్చే ప్రకటనలు నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. మాయగాళ్ల చేతిలో సొమ్ము నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నం.1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**సాయం పేరుతో మోసం**విదేశాల్లో ఉన్న తమ వర్గానికి చెందిన ప్రజలకు సాయం చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు ఒక యువకుడిని ఆకట్టుకుంది. అవతలి వారిని యాప్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించాడు. మిత్రుల సహకారంతో నిధులు సేకరించి వారు సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేశాడు. ఆ తరువాత వాస్తవం తెలియటంతో మోసపోయినట్టు గ్రహించాడు. పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. ప్రార్థనామందిరం నిర్మాణానికి తాము సాయం చేస్తామని మాయగాళ్లు చెప్పటంతో నిజమని భావించాడు. బ్యాంకు ఖాతా వివరాలు పరిశీలించేందుకు కొంత నగదు జమచేయాలంటూ దఫాలవారీగా రూ.1.50లక్షలు కొట్టేశారు. అనంతరం ముఖం చాటేయటంతో నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# వరికి తెగులు.. అన్నదాతల్లో గుబులు



ఎల్లారెడ్డిపేట: మెట్ట ప్రాంతమైన జిల్లాలో అన్నదాతలకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఓ వైపు సాగునీటి కొరత నెలకొనగా మరోవైపు వరిపంటకు తెగుళ్లు సోకుతుండటంతో దిగులు చెందుతున్నారు. కాండం తొలుచు(మొగి) పురుగుతో ఇప్పటికే పైరు తెలుపురంగులోకి మారుతుండగా అగ్గితెగులు విజృంభిస్తోంది. తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తుండటంతో అదనంగా పెట్టుబడి వ్యయమవుతోంది. కాండం తొలుచు పురుగు నారు దశలో వరిపై చేరి, కంకి ఏర్పడే దశలో బయటపడుతుంది. పంటచేతి కందే దశలో గింజలు తాలు పోతున్నాయి. ఈ ప్రభావం జిల్లా వ్యాప్తంగా నెలకొంది. అగ్గితెగులు వల్ల తొలుత ఆకులపై ఎర్రటి మచ్చలేర్పడుతున్నాయి. క్రమేణా కండె ఆకారంలో పెద్దగా మారడం వల్ల ఆకులు ఎండిపోతున్నాయి. ఈ కారణంగా వరిగొల పూర్తిగా విరిగిపోయి, నేలరాలిపోతుంది. వీటితోపాటు గింజ దశలో కంకినల్లి పురుగు ఆశిస్తోంది. గింజల నుంచి రసం పీల్చడం వల్ల గింజలు తాలుపోతున్నాయి.

**అన్నదాతలకు నష్టం** ఈ యాసంగిలో జిల్లాలో 1,78,350 ఎకరాల్లో వరి సాగు చేశారు. సన్నరకాలను 17,505 ఎకరాల్లో, దొడ్డు రకాలను 1,60,845 ఎకరాల్లో సాగుచేశారు. మొత్తం కలుపుకొని 4,38,872 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్ తదితర మండలాల్లో తెగుళ్ల ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. **పెట్టుబడి చేతికందని పరిస్థితి**

ఈ యాసంగిలో ఏడెకరాల విస్తీర్ణంలో దొడ్డు రకం వరి సాగుచేశాను. పంటమొత్తం ఈని, గింజలు గట్టిపడే దశకు చేరుకుంది. దాదాపు 40 శాతానికి పైగా పైరు తాలుపోయి, తెలుపురంగులోకి మారిపోయింది. రెండుమూడు సార్లు పురుగు మందులను పిచికారీ చేసినా ఎలాంటి ఫలితం లేకపోయింది. పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఎలాంటి రసాయన మందులు వాడినా ప్రభావం ఉండదని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.
అరికాల రామచంద్రం, రైతు, రాచర్ల బొప్పాపూర్

**సస్యరక్షణ చర్యలు పాటిస్తే మేలు**

తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి. కంకి బయటకు వచ్చిన తర్వాత ఊసపోవడాన్ని గమనిస్తే క్లోరాంతనిలిప్రోల్ 60 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. కార్టాఫ్‌క్లోరైడ్ గుళికలను చల్లుకున్నా సరిపోతుంది. అగ్గితెగులు లక్షణాలు బయటపడితే యూరియా చల్లడం నిలిపివేయాలి. గట్లపై గడ్డిలేకుండా పూర్తిగా పరిశుభ్రపరచాలి. వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలి. కాసం రాజశేఖర్, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

# నిధులు రావు.. పనులు పూర్తికావు



సిరిసిల్ల: జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల పనులకు అవసరంమేరకు నిధులు రాక, అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. చందుర్తి మండలంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభించారు. బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యకేంద్రం వినియోగిస్తుండటంతో ఇటీవల గుత్తేదారులు దానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. గ్రామస్థులు నచ్చజెప్పడంతో వెనక్కితగ్గారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఎస్సీ సామాజిక భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు.

**సామాజిక భవనాలే అధికం** జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీఎంఎఫ్‌టీ, ఎన్‌హెచ్ఎం, సంక్షేమశాఖలు, ఎంపీల్యాడ్స్‌లో సామాజిక భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఆయా పనులకు ప్రొసీడింగ్స్ సైతం ఇచ్చారు. వీటిలో ఎన్‌హెచ్ఎం (జాతీయ ఆరోగ్యమిషన్ పథకం)లో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ఎనిమిది చోట్ల దాదాపు పనులు పూర్తయ్యాయి. మరో నాలుగు గ్రామాల్లో కొద్దిమేరకు పనులు మాత్రమే మిగిలాయి. అద్దెభవనాల్లో కొనసాగుతున్న గ్రామాల్లో పనులు పూర్తయిన చోట ఉపకేంద్రాల్లోకి వెళ్లి.. ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ.16 లక్షలతో పనులు చేపట్టారు. వీటిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఎన్‌హెచ్‌ఎంకు జమచేసినట్లు గుత్తేదారులు చెబుతున్నారు. కాగా అధికారులు మాత్రం నిధులు విడుదల కాలేదంటూ కాలం వెళ్లదీస్తున్నారని వాపోతున్నారు.

**ప్రతిపాదనల దశలోనే**వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రహదారుల మరమ్మతుకు డీఎంఎఫ్‌టీ కింద వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఏడు పనులకు రూ.3.99 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇందులో చేసిన పనులకు రూ.43.07 లక్షలు మంజూరు కావాల్సి ఉంది.ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతి కల్పించేందుకు వివిధ మండలాల్లో 36 నిర్మాణాలకు రూ.72 లక్షలు మంజూరయ్యాయి. అలాగే 50 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.4 కోట్లు, ఎనిమిది పంచాయతీ భవనాలకు రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. ఆరు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల పనులు నామమాత్రంగా ప్రారంభించారు. మిగతా పనులకు గుత్తేదారులు ముందుకు రాకపోవడం గమనార్హం. బిల్లుల విడుదలపై పీఆర్ ఈఈ సుదర్శన్‌ను 'ఈనాడు' సంప్రదించగా పనులు పూర్తయిన వాటికి రికార్డులు పూర్తిచేసి ప్రభుత్వానికి పంపామన్నారు.

# చీకట్లో సౌర.. బిల్లు పెరిగి ఔరా!



సిద్దిపేట: 'ఏంది రామయ్యా.. దిగులుగా ఉన్నవు?' 'ఏం లేదే లక్ష్మయ్యా.. గతంలో మా ఇంటికి కరెంటు బిల్లు రూ.100 నుంచి రూ.150 వచ్చేదే. ఇప్పుడు రూ.300 నుంచి ఒక్కోసారి రూ.700 వస్తోందే.' 'నాక్కూడా కరెంటు బిల్లు గట్లనే ఎక్కువొస్తున్నదే. సోలార్ ప్లేట్లు బాగా పనిచేసిన కాలంలో బిల్లు తక్కువొచ్చేది' 'అవును కదనే. ఆ సోలార్ ప్లేట్లు ఖరాబాయె. రిపేర్ చేసేటందుకు ఎవరూ పట్టించుకోకపాయె. మరమ్మతు చేస్తే మనకు.. ఊరికి మంచిగుండేది' ... ఇలా నారాయణరావుపేట మండలం బంజేరుపల్లిలో గ్రామస్థుల ఆవేదన. **రెండేళ్లుగా పనిచేయని తీరు**

రెండేళ్లుగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామంలోని దాదాపు ప్రతి ఇంటికి అమర్చిన సౌర ఫలకలు పనిచేయడం లేదు. మరమ్మతులకు గురవడంతో వినియోగంలో లేవు. పెరిగిన విద్యుత్తు బిల్లులతో సతమతమవుతున్నారు. కొందరికి మాత్రమే 200 యూనిట్ల లోపు కరెంటు కాల్చిన వారికి గృహజ్యోతి కింద ఉచితంగా వర్తిస్తోంది. ఈ గ్రామ ప్రజలంతా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. 2017లో అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు గ్రామంలో సౌర ఫలకలు ఏర్పాటు చేయించారు. ఆరు సంవత్సరాల తర్వాత వివిధ కారణాలతో పని చేయడం మానేశాయి. నాడు తక్కువ విద్యుత్తు బిల్లులు వచ్చేవి. జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలో నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామం ఉంది. సహజ వనరు అయిన సూర్యకాంతి వినియోగంతో విద్యుత్తు ఉత్పత్తితో ఇంటి అవసరాలకు విద్యుత్తు వినియోగించుకోవడానికి గ్రామస్థులంతా ఒక్కటై సౌర ఫలకలు ఏర్పాటు చేయించుకున్నారు. ఆన్‌డోమెడ్, టాటా కంపెనీ సహకారంతో నాడు బిగించారు. సౌర వెలుగుతో ఉత్పత్తి అయిన విద్యుత్తును చక్కగా ఇంటి అవసరాలకు వినియోగించుకునేవారు.

పునరుద్ధరిస్తే మేలు: చందు, గ్రామస్థుడు

గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ఫలకలు నిర్వహణ లేకపోవడంతో పని చేయడం లేదు. ప్రభుత్వం మరమ్మతు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు ఎంతో ఉపయోగం. వాటిని వినియోగించుకున్న సమయంలో తక్కువ విద్యుత్తు వినియోగించుకునే వాళ్లం. ప్రస్తుతం అవి పని చేయక పోవడంతో విద్యుత్తు యూనిట్ల వినియోగం పెరిగింది. ఖర్చు పెరిగింది.

బంజేరుపల్లి జనాభా: 600
గ్రామంలో గృహ విద్యుత్తు కనెక్షన్లు: 118
ప్రస్తుతం యూనిట్ల వినియోగం: 9285
ఊరంతా బిల్లు మొత్తం (రూ.లో): 40,000
సౌర ఫలకలు ఉన్న ఇళ్లు: 100
పని చేసిన సంవత్సరాలు: 6

# నేతన్న ఆదాయం ఆర్జించేలా..

దుబ్బాక: ప్రస్తుతం చేనేత రంగంలోనూ ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. విభిన్నమైన చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరిగింది. అందులోనూ పోచంపల్లి ఇక్కత్ కాటన్ చీరలు అంటే ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు ఇష్టపడుతున్నారు. దీన్ని అందిపుచ్చుకొని వీటిని తయారుచేసి దుబ్బాక నేత కార్మికులు ఆదాయం ఆర్జించేలా తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) కార్యాచరణ రూపొందించి అడుగేయడం విశేషం.

**ముడి సరకు ఇచ్చి..**

దుబ్బాక చేనేత సొసైటీలో 1734 మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం 50 మంది మాత్రమే 40 మగ్గాలపై వస్త్రాలు నేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ తరుణంలో వీరిని మరింత ప్రోత్సహించేందుకు టెస్కో ఆదేశాలతో తక్కువ బరువు, మృదువుగా ఉండే పోచంపల్లి ఇక్కత్ కాటన్ చీరలు నేయిస్తున్నారు. నెల రోజుల కిందట ఈ ప్రక్రియ మొదలవవగా, టెస్కో కావాల్సిన ముడి సరకును అందించడంతో పాటు నేసిన చీరలను సైతం కొనుగోలు చేసి విక్రయిస్తోంది. సంప్రదాయ టై అండ్ డై టెక్నిక్‌ను ఉపయోగించి, పేక (అడ్డు-వెఫ్ట్) 80 సింగిల్, వార్ఫ్ (నిలువు) 120 డబుల్ పద్ధతిలో వీటిని



రూపొందిస్తున్నారు. ఇందుకు వినియోగించే నూలు దారాలకు రంగు వేసే ప్రకియనూ చేపడుతున్నారు.

**రెండు రోజుల సమయం..**

ప్రస్తుతం ఒకే మగ్గంపై సాధారణ డిజైన్లలో ఇక్కత్ చీరలను ఇద్దరు కార్మికులు నేస్తున్నారు. ఒక చీర తయారీకి రెండు రోజుల సమయం పడుతోంది. ఇందుకు వారికి రూ.800, దారాలను కండెలపై చుట్టిన వారికి రూ.100 కూలీగా చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ డిజైన్లలో 15 చీరలను తయారుచేశారు. కూలీ ఖర్చులు రూ.900, ముడి దారాలకు రూ.1000 ఖర్చవుతోంది.

**తువాళ్లను తయారు చేస్తాం**

నేత కార్మికులు ఆదాయం ఆర్జించేందుకు టెస్కో ఆదేశాలతో పోచంపల్లి ఇక్కత్ మస్‌రేస్‌డ్ కాటన్ చీరలను నేయిస్తున్నాం. వచ్చే ఆర్డర్లను వీటి తయారీకి ఏర్పాట్లు చేస్తున్నాం. రానున్న రోజుల్లో ఇక్కత్ కాటన్ తువాళ్లను సైతం తయారుచేయనున్నాం.జి.భాస్కర్, సొసైటీ బాధ్యుడు

# అంగన్వాడీ కేంద్రం.. ఆరోగ్య భాగ్యం

నర్సాపూర్: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో సేంద్రియ విధానంలో పెరటితోటల పెంపకం చేపట్టారు. జిల్లాలోనే నర్సాపూర్ ప్రాజెక్టు ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రాజెక్టు పరిధిలో నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలున్నాయి. వీటి పరిధిలో 288 అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. 80 శాతం కేంద్రాల్లో వివిధ ఆకు కూరలు పెంచుతున్నారు. పక్కా భవనాలు, విశాలమైన ఆవరణ ఉన్న చోట ఈ ప్రక్రియ చక్కగా కొనసాగిస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా, ఆకు కూరలు, పండ్ల మొక్కలు నాటేస్తున్నారు. స్థలం లేనివారు చిన్ననీటి తొట్లు, కుండీలు, బకెట్లు, పగిలిపోయిన బిందెల్లో పెంచుతున్నారు. టీచర్లు, ఆయాలు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

**ఉచిత విత్తనాలు**

పాలకూర, మెంతి, గోంగూర, బచ్చలి, చామ, కరివేపాకు వంటి వివిధ రకాలైన ఆకు కూరలు పండిస్తున్నారు. జిల్లాలో దక్కన్ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్రం(తునికి) విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నాయి. ప్రాజెక్టు పరిధి అంగన్వాడీ టీచర్లకు తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆరు నెలలకోసారి అయిదు కేంద్రాలను ఎంపిక చేసుకుని తోటల పెంపకం చేపడుతూ పౌష్టికాహారం అందిస్తున్నారు. జామ, బొప్పాయి, దానిమ్మ, గుమ్మడి వంటి పండ్ల మొక్కలను సంరక్షిస్తూ కేంద్రాలకు వచ్చే వారికి పంపిణీ చేస్తున్నారు. సీడీపీవో పర్యవేక్షణలో 11 మంది పర్యవేక్షకులు కేంద్రాలను సందర్శిస్తూ పెంపకం దారులను



ప్రోత్సహిస్తున్నారు.

**ఈ కేంద్రాలు ఆదర్శం**

నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్, రెడ్డిపల్లి తదితర గ్రామాలు, కౌడిపల్లి ఉమ్మడి మండలంలో జగ్గంపేట, కొత్త చెరువు తండా, కౌడిపల్లి-4, శివ్వంపేట మండలం దొంతి, లింగోజిగూడ, చెన్నాపూర్, పిల్లుట్ల, తూప్రాన్ ఉమ్మడి మండలంలో కాళ్లకల్, అగ్రహారం, లింగారెడ్డిపేట, పోతురాజ్‌పల్లి తదితర కేంద్రాలు. కొన్ని కేంద్రాలకు కంచెను ఏర్పాటు చేయగా, మరికొన్ని చోట్ల గేట్లను అమర్చారు. కొందరు ఒకేచోట తోటల సాగు చేపడుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడి, పౌష్టికాహారం అందించడంతో వచ్చేవారి సంఖ్య పెరిగిందని, తద్వారా లోపపోషణను అధిగమించగలుగుతున్నామని అధికారులు చెబుతున్నారు.

**పోషకాహార లోపాన్ని అధిగమిస్తున్నాం**చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పెరటి తోటల పెంపం ఎంతగానో దోహదపడుతోంది. మూడునెలల పాటు ఆకుకూరలు, పండ్లు, రాగి జావ వంటివి ఇస్తే చిన్నారుల ఎదుగుదలలో కొంత మార్పు కనిపిస్తోంది. జిల్లాలోనే ప్రాజెక్టు పరిధిలో తోటల పెంపకంలో ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉంది. హేమాభార్గవి, సీడీపీవో

చరకలు



# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ




ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పొరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు.

అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022-23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద 'మన ఊరు - మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# ఉపయోగం వెన్నంటే ఉపద్రవం!



గోదావరిఖని : కర్ణాటక రాష్ట్రంలోని హోటళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించారు. ఇడ్లీల తయారీకి ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం గుర్తించింది. 250 నమూనాలు సేకరించి పరీక్షలు జరిపారు. 52 నమూనాల్లో క్యాన్సర్ కారకాలను గుర్తించి హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిషేధించింది. 120 మైక్రాన్‌ల కన్నా ఎక్కువ మందం ఉన్న వాటినే అనుమతిస్తున్నారు. ఈ నిబంధనలు ఉమ్మడి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ సంచుల వినియోగం అధికంగా ఉంది. మార్కెట్‌కు వెళ్తే వెంట వస్త్ర సంచులు తీసుకెళ్లాలన్న ఆలోచన జనంలో ఉండటం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఇటు ఆరోగ్యానికి అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందన్న కనీస స్పృహ కరవైంది. అధికారులు అప్పుడప్పుడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా.. వినియోగిస్తున్నా జరిమానాలు విధిస్తున్నారు. అయినా పూర్తి స్థాయి నియంత్రణ సాధ్యపడటం లేదు. సాధారణ వస్తువులతోపాటు ఇటీవల కాలంలో వేడి పదార్థాలను కూడా ప్లాస్టిక్ సంచుల్లోనే ప్యాకింగ్ చేసి తీసుకెళ్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నా జనం పెడచెవిన పెడుతున్నారు. ఎటైనా వెళ్లినప్పుడు ప్రత్యేకంగా సంచి తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదన్న ఒక్క కారణంతో ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 14 పురపాలక సంఘాల పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణకు అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాని నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవడం లేదు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సిన అధికారులు సిబ్బంది కొరత కారణంగా మొక్కుబడిగా తనిఖీలు చేపడుతున్నారు. నగర, పురపాలక సంఘాలతోపాటు గ్రామ పంచాయతీల్లో కూడా ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలి. కాని దీనిపై ప్రత్యేక పర్యవేక్షణకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో నియంత్రణ సాధ్యమవడం లేదు.

**పర్యావరణానికి విపత్తు**

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలు తీసుకెళ్లడం వల్ల రసాయనిక చర్య జరిగి హానికరమైన కణాలు తయారవుతాయి.

మైక్రో ప్లాస్టిక్‌లోని రసాయనాలు శరీరంలోని కణాలను దెబ్బతీస్తాయి. హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతాయి.

మురుగు కాలువల్లో ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి వర్షాలు పడినప్పుడు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి

చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని పశువులు, వన్య ప్రాణుల ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసిపోవడం వల్ల భూసారం తగ్గిపోతోంది. వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకకుండా అడ్డుపడుతుంది. ఫలితంగా భూగర్భ జలాలు పడిపోతాయి. ఇలా చేసి చూద్దాం..ప్రతి ఒక్కరూ వస్తువులు, కూరగాయల కొనుగోలుకు వెళ్లే సమయంలో వస్త్ర సంచులు తీసుకెళ్లాలి. ఆహార పదార్థాలను తెచ్చుకోవడానికి స్టీల్ డబ్బాలు ఉపయోగించాలి. ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున 750 మంది మహిళల్లో, 400 మంది పురుషుల్లో క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తున్నారు.

క్యాన్సర్ ముప్పు ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. ప్లాస్టిక్ తయారు చేసేందుకు వినియోగించే రసాయనాలు మనం తెచ్చుకునే ఆహార పదార్థాల్లోకి చేరతాయి. వాటిని భుజించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. జీవక్రియ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని ఎంత తగ్గించగలిగితే అంత మేలు. -డా.అశోక్‌కుమార్, సీనియర్ ఫిజిషియన్, గోదావరిఖని

# నిధులు వస్తేనే జాతర నిండుగా!



ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలపై నిధుల ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నెల 10 నుంచి 13 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కనీస వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. రెండేళ్ల నుంచి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం లేదు. భారాస ప్రభుత్వం హయాంలో నాలుగేళ్ల కిందట సుమారు రూ.50 లక్షల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడినా విడుదల మాత్రం కాలేదు. వసతుల కల్పనపై సమన్వయ సమావేశంలో చర్చిస్తున్నా.. నిధులు కేటాయించడం లేదు.

**పెండింగ్‌లో రూ.15 లక్షలు**

రెండేళ్లుగా దేవస్థానంలో జాతర ఏర్పాట్ల బిల్లులను అధికారులు చెల్లించడం లేదని గుత్తేదార్లు, అదనపు కార్మికులు వాపోతున్నారు. అదనపు పారిశుద్ధ్య కార్మికులకు, బ్లీచింగ్ పౌడర్, విద్యుత్తు గుత్తేదార్లకు ఇంతవరకు మున్సిపల్ నుంచి ఒక్క రూపాయి రాలేదు. సుమారుగా రూ.15 లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. బకాయిలు చెల్లించాలంటూ బాధితులు పురపాలక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బకాయిలు చెల్లిస్తేనే జాతరకు ఏర్పాట్లు చేస్తామని గుత్తేదార్లు అంటున్నారు. అలాగే అదనపు కార్మికులను సుమారుగా 100 మందిని తాత్కాలిక పద్ధతిలో తీసుకుంటున్నారు.

గోదావరి ఎగువ ప్రాంతంలో సత్యవతి, బ్రహ్మగుండాల వద్ద లోతు ఉండటంతో భక్తులు స్నానానికి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇక్కడ ప్రమాదం తెలిపేలా బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలి. సంతోషీమాతా, మంగళిగడ్డ ప్రాంతంలో దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలి. దేవస్థానంలో తాగునీటికి కటకట ఏర్పడుతోంది. క్యూలైన్ల వద్ద తాగునీటి వసతులు కల్పించాల్సి ఉంది. పుర అధికారులు ప్రతి వాహనానికి రూ.50 వసూలు చేస్తున్నారే తప్ప పార్కింగ్ స్థలంపై దృష్టి సారించడం లేదు. మరుగుదొడ్ల నిర్మాణం రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. రాయపట్నం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలి. ధర్మపురి పట్టణంలో అంతర్గత రహదార్లు అధ్వానంగా మారాయి.

# అతివలకు అండ

మెదక్: పని ప్రదేశంలో వేధింపులకు గురయ్యే అతివలకు 'మహిళా సాధికారత కేంద్రం' బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వ శాఖల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)ల ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. పలు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ రంగంలో కమిటీలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఆయా శాఖల్లో ఐసీసీలు ఏర్పాటు కాగా, మిగిలిన వాటిల్లో పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం-2013 ప్రకారం శారీరక సంబంధం, లైంగిక ప్రయోజనాలను కాంక్షిస్తూ అభ్యర్థించడం, లైంగికపరమైన వ్యాఖ్యలు, అశ్లీల చిత్రాలను చూపుతూ అసభ్య ప్రవర్తనకు పాల్పడటం నేరంగా పరిగణిస్తారు.

**జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ...**

జిల్లా స్థాయిలో స్థానిక ఫిర్యాదుల కమిటీ(ఎస్‌సీసీ) పని చేయనుంది. ఇందులో కనీసం ఐదుగురు ఉంటారు. సభ్యుల్లో జిల్లా అధికారిణులు, న్యాయవాది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు భాగస్వాములు కానున్నారు. ఇది వరకు కమిటీ ఉండగా, ప్రతి మూడేళ్లకు ఒకసారి మార్పు చేయాల్సి ఉండడంతో కొత్త కమిటీ ఏర్పాటుకానుంది.

**ఫిర్యాదు ఎలా అంటే...**

లైంగికపరమైన వేధింపులకు గురైతే ఐసీసీకి ఫిర్యాదు చేస్తే గోప్యంగా విచారణ చేస్తారు. పరిష్కారం కాకుంటే ఎల్‌సీసీ వరకు వెళ్లొచ్చు. సంఘటన జరిగిన మూడు నెలల్లోపు ఫిర్యాదు చేయొచ్చు. మరికొన్ని సందర్భాల్లో అదనపు కాల పరిమితిని పరిగణనలోకి తీసుకుంటారు. విచారణ పూర్తయిన తరువాత నివేదికను ఇరుపక్షాలకు చేరవేయాలి.

**నోడల్ అధికారులుగా తహసీల్దార్లు...**

వేధింపులకు సంబంధించి మహిళలు మండల స్థాయిలో తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లవచ్చు. తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. కేసులు వచ్చినా మహిళా



సాధికారత కేంద్రం దృష్టికి తీసుకురావాలి.

**అన్ని సంస్థల్లోనూ అమలు**

ప్రైవేటు, ప్రభుత్వ, ఇతర సంస్థలు సహా అన్ని ప్రదేశాల్లో 10 లేదా అంతకుమించి ఉద్యోగులున్న చోట కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. జిల్లాలో 12 ప్రభుత్వ శాఖల్లో, 31 కంపెనీలు, ఆరు షాపింగ్ మాల్స్‌లలో ఐసీసీ కమిటీలు ఏర్పాటయ్యాయి. సీనియర్ ఉద్యోగి ప్రిసైడింగ్ అధికారిగా, మిగిలిన వారు సభ్యులుగా ఉంటారు. అవసరం మేర స్వచ్ఛంద సంస్థలు, నాయకత్వ లక్షణాలు కలిగిన మహిళలను తీసుకుంటారు. వీరు ప్రతి ఏడాది నివేదికను మహిళా సాధికారత కేంద్రంలో అందజేయాలి.

**ఉపేక్షించవద్దు**

ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో ఐసీసీల ఏర్పాటుపై దృష్టి సారించాం. రానున్న రోజుల్లో పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయిస్తాం. జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ ఏర్పాటు చేస్తాం. వేధింపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు. సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 181, 100కు ఫోన్ చేయాలి. సంతోషి, జిల్లా సమన్వయకర్త, మహిళా సాధికారత కేంద్రం

# సంతోషాలను 'ఏరు'కో..!

భద్రాచలం : తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలంటే సాధారణంగా ఏపీలోని కోనసీమ అందాలు.. మారేడుమిల్లి పాపికొండలు.. బొర్రా గుహల పేర్లు వినిపిస్తుంటాయి. అదేస్థాయిలో అనుభూతులను పంచేందుకు 'ఏరు' ఉత్సవం వేదికవనుంది. నీటివనరులను ఆస్వాదించేందుకు భద్రాచలం మన్యం కేంద్రంగా సాగే ఈ యాత్ర పూర్తిగా ప్రకృతితో మమేకం చేస్తుంది. దైనందిన జీవితంలో అలసినవారు సంతోషాలను ఏరుకునే యాత్ర ఇది. తొలి విడతగా ఏరు ఉత్సవాన్ని గురువారం ప్రారంభించి శనివారం వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాత ప్రతి మూడు రోజులకు ఒక ప్యాకేజీ కింద పర్యాటకులను ఆహ్వానిస్తారు. స్నానఘట్టాల వద్ద ఆహార పదార్థాలు, హస్త కళారూపాలను స్టాళ్లలో ఉంచారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవతో 'రివర్ ఫెస్టివల్'కు రూపకల్పన జరగటంతో భద్రాద్రి జిల్లా పర్యాటకానికి మహర్దశ పట్టనుంది.

**మూడు రోజుల యాత్ర ఇలా..**

1. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన క్యాంప్ కుటీరాలకు పర్యాటకులు చేరుకుంటారు. వీటిలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. టీ లేదా కాఫీ, బిస్కెట్లు ఇస్తారు. బోట్ షికారు చేయవచ్చు. సాయంత్రం 5 గంటలకు ఘాట్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు క్యాంప్



కుటీరాలకు చేరుకుని క్యాంప్ ఫైర్‌ను ఆస్వాదించవచ్చు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది.

2. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చు. 7 గంటలకు అల్పాహారం, 8 గంటలకు కిన్నెరసాని బోట్ షికారు, మధ్యాహ్నం 12కి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఇక్కడ సృష్టించిన ఆదివాసీ పల్లెను చూడవచ్చు. అక్కడే మధ్యాహ్న భోజనం చేయాలి. సాయంత్రం 4 గంటలకు బొజ్జిగుప్ప ఆదివాసీ పల్లెను సందర్శిస్తారు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది. అక్కడి వాగులో బోటింగ్ చేయవచ్చు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలను చూడవచ్చు. రాత్రి 8కి తిరిగి క్యాంప్ కుటీరాలకు చేరుకుని బస చేస్తారు.

3. శనివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసి చంద్రుగొండ మండలం కనిగిరిగుట్ట టెక్కింగ్‌కు చేరుకోవాలి. అక్కడ టీ, స్నాక్స్‌తో పాటు మధ్యాహ్నం భోజనం ఉంటుంది. గుట్ట పైనుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. మధ్నాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెం చేరుకున్నాక యాత్ర పూర్తవుతుంది. మూడు రోజుల ప్యాకేజీలో టికెట్ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ.6వేలు, 12ఏళ్లలోపు పిల్లలకు రూ.4వేలు నిర్ణయించారు.

మాది ములకలపల్లి మండలం. మాలాంటి పది మంది మహిళలకు ఆవులు, గేదెలు ఉండటంతో స్వచ్ఛమైన నెయ్యి విక్రయిస్తున్నాం. దీనికి అధికారుల నుంచి ధ్రువపత్రం ఉంది. రాములోరి క్షేత్రంలో ఏరు ఉత్సవాల సందర్భంగా స్టాల్ ఏర్పాటుకు అవకాశం లభించింది. ఆదరణ బాగుండటంతో ఈ రంగంలో రాణిస్తామనే నమ్మకం కలిగింది. టి.మంజుల, జి.లత

భద్రాచలం ఐటీడీఏ సహకారంతో రాగి, జొన్న, కొర్రలతో బిస్కెట్లు తయారు చేస్తుంటాం. ఏరు ఉత్సవం సందర్భంగా స్టాల్‌లో వీటిని ఉంచుతున్నాం. పర్యాటకులు తిని మెచ్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. మాకు ఉపాధి లభిస్తుందనే భరోసా కలిగింది.

టి.లలిత, వి.వెంకటలక్ష్మి

భద్రాచలంలో బ్యూటీషియన్ శిక్షణ తీసుకున్నాం. తక్కువ పెట్టుబడితో మేం ఏర్పాటుచేసిన మెహందీ స్టాల్‌కు ఆదరణ లభిస్తోంది. ముక్కోటి, ఏరు ఉత్సవాల కోసం వచ్చేవారు మెహందీకి ప్రాధాన్యమిస్తుండటంతో స్వయం ఉపాధిపై మాకు నమ్మకం ఏర్పడింది. ఈ ప్రాంత యువతకు ఇదో చక్కని అవకాశం.

ఎం.రేణుక, కె.పావని, ఎస్.దుర్గ

# గోదావరిలోకి దారి వేసి..ఇసుకను కాజేసి

కడెం: కడెం మండలం లింగాపూర్ గోదావరి రేవు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇందుకు గ్రామ కమిటీకి కొంత రుసుము చెల్లించి ఆమోదం పొందినట్లు సమాచారం. అదే అదనుగా ఇలా నేరుగా దారి వేసుకుని గోదావరి నుంచి ఇసుకను తెచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. ఇక్కడి నుంచి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కడెం మండలంలోని గోదావరి రేవుల వెంట ఇలా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని కోల్పోయే అవకాశముంది. ఇలాంటి



అక్రమ దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు లేవని, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని, దంపులు ఉంటే సీజ్ చేస్తామని, తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. ట్రాక్టర్‌లో మట్టిని గోదావరి నదిలోకి తీసుకెళుతున్నారు చూశారా.. గ్రామంలో అయితే ఏదో దారి వేసేందుకో, ఇంటి అవసరాలకో అనుకోవచ్చు. కానీ ఏకంగా గోదావరిలోకి మట్టి ట్రాక్టర్లను ఎందుకు తీసుకెళుతున్నారంటే గోదావరిలోనూ దారి నిర్మించేందుకే. అవును గోదావరి మధ్యలో ఇసుక తెట్టెలుగా ఉంది. అక్కడి వరకు ట్రాక్టర్లు వెళ్లాలంటే మొదట దారి వేసుకోవాలి. ఇందుకు ఎవరి అనుమతీ అక్కర లేదు. దర్జాగా మట్టి తరలించి గోదావరిలో దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలించడమే వీరి ఉద్దేశం.

# నకిలీలు.. నాటకాలు

ఒంగోలు: గత వైకాపా హయాంలో పింఛనుదారుల ఎంపికలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం తనిఖీలు చేయిస్తోంది. మూత్రపిండాల వ్యాధి ఉందంటూ పింఛను పొందుతున్న వారిని గతేడాది డిసెంబరులో తనిఖీ చేయగా.. 415 మంది అనర్హులుగా తేలారు. పక్షవాతం, అనారోగ్యంతో పూర్తిగా మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛను పొందుతున్న వారికి సంబంధించి వైద్య బృందం జనవరిలో నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రత్యక్షంగా పరీక్షించింది. 69 శాతం మంది అనర్హులున్నారని, వారిలోనూ 32 శాతం మంది రూ.ఆరు వేల దివ్యాంగ పింఛను పొందడానికి వీలుందని గుర్తించింది. ప్రస్తుతం దివ్యాంగ పింఛను పొందుతున్న వారిని పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా కొందరు నకిలీలు నాటకాలకు తెర లేపారు. వీరిని గుర్తించడం వైద్యులకు ఇప్పుడు కత్తిమీద సాములా మారింది.

**ముందుగానే నోటీసులు:** జనవరిలో రూ.6 వేల పింఛను పొందిన దివ్యాంగుల్లో అర్హుల గుర్తింపునకు వారానికి మూడు రోజులు(బుధ, గురు, శుక్రవారం) శిబిరాలు నిర్వహిస్తున్నారు. చీమకుర్తి, గిద్దలూరు, కొండపి, దర్శి, యర్రగొండపాలెం(శారీరక వైకల్యం), ఒంగోలు, మార్కాపురం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల(అంధులు, బధిరులు, మానసిక ఆరోగ్యం, వైకల్యం)లో ప్రత్యక్షంగా చూసి, ధ్రువపత్రాలు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోజూ ఒక్కో విభాగానికి సంబంధించి 40 మందిని పరీక్షిస్తున్నారు. వీరు శిబిరానికి హాజరు




కావడానికి వీలుగా సెర్ప్ సిబ్బంది ద్వారా ముందే నోటీసులు అందిస్తున్నారు.

**తల పట్టుకుంటున్న వైద్యులు:** రూ. 15 వేల పింఛను పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించడంలో వైద్యులకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కాలేదు. వారిలో ఆరోగ్యంగా ఉండి సైకిల్ తొక్కేవారు, ట్రాక్టర్ నడిపేవారు, కిరాణ దుకాణం నిర్వాహకులు, పరుగెత్తే వారూ ఉన్నట్లు సులువుగానే గుర్తించారు. దివ్యాంగ పింఛనుదారుల్లో నకిలీలను గుర్తించడం మాత్రం కష్టంగా మారింది. 'ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి గేటు వద్ద ఆటో దిగిన ఓ వ్యక్తి నడుచుకుంటూ లోపలికి వెళ్లాడు. మెట్లూ ఎక్కాడు. వైద్యుడు పరిశీలించే సమయానికి నడలేకపోతున్నానని, చేతులు కదలవంటూ నటించాడు. దీంతో వైద్యులు విస్తుపోయారు. బధిర పింఛనుదారుల్లో ఆరోగ్యవంతులు కూడా తమకు వినిపించడం లేదని, అంధ పింఛనుదారుల్లో కొందరికి చూపు బాగున్నా కనిపించడం లేదని చెబుతుండటంతో వైద్యులు తల పట్టుకుంటున్నారు. 'ఆగస్టు వరకు దివ్యాంగుల పరిశీలన కొనసాగే అవకాశం ఉంద'ని డీసీహెచ్‌ఎస్ సూరిబాబు తెలిపారు. దివ్యాంగులను ఒక వైద్యుడు పరిశీలిస్తే.. మరో ఇద్దరు స్క్రూటినీ చేస్తున్నారని, వారందరి నివేదికల ఆధారంగా కంప్యూటర్‌లో వైకల్యం నమోదు అవుతుందని వివరించారు.

# ఏం కావాలన్నా.. ఇచ్చేస్తారు!

భీమవరం : తణుకుకు చెందిన నాగమ్మ కీళ్లనొప్పులతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంది. 15 రోజులకు మాత్రలు సూచించారు. కోర్సు పూర్తయినా నేరుగా ఔషధ దుకాణానికి వెళ్లి మందుల అట్ట చూపించి మందులు తెచ్చుకుని వాడింది. ఫలితంగా మరిన్ని అనారోగ్య సమస్యలు తలెత్తాయి.

భీమవరానికి చెందిన శ్రీకాంత్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం.. ఇలా ఏదొచ్చినా యాంటీబయోటిక్స్ వాడేస్తున్నారు. ఈ క్రమంలో నోటిపూత వచ్చి ఏమీ తినలేకపోవడంతోపాటు శరీరంలో రక్తకణాల సంఖ్య తగ్గిపోయింది. వైద్యుడి వద్దకెళ్లి చూపిస్తే.. అతిగా మాత్రలు తీసుకోవడం వల్లే ఇలా అయ్యిందని తేలింది. ఉభయ జిల్లాల్లోని మందుల దుకాణాల్లో మత్తు కలిగించే ఔషధాలను సైతం యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. యాంటీ డిప్రెషన్, యాంటీ అలర్జీ, అధిక మోతాదు నొప్పి నివారణ మాత్రలు, దగ్గు ద్రావణాలను కచ్చితంగా వైద్యుల చీటీ ఉంటేనే విక్రయించాల్సి ఉండగా, దుకాణాల నిర్వాహకులు అవేమీ పట్టించుకోవడం లేదు. చాలా దుకాణాల్లో అర్హులైన ఫార్మాసిస్టులే లేరని కొందరు వైద్యులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ గరుడలోనూ దీన్ని గుర్తించారు. కాలపరిమితి ముగిసిన మందులు సైతం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



ఆర్‌ఎంపీలతో కుమ్మక్కై గ్రామీణ రోగులకు ఈ ఔషధాలు అంటగడుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ.. పారాసెటమాల్, డైసైక్లోమైన్, ట్రెమడాల్ సమ్మిళిత ఔషధాన్ని తీవ్రమైన నొప్పి నివారణకు వైద్యులు సూచిస్తుంటారు. ట్రెమడాల్ అనే ఔషధం ఓపియాయిడ్స్ అనే మాదక ద్రవ్యాల జాబితాకు చెందింది. మెదడులోని నోర్‌ఫైన్‌ఫ్రైన్, సెరోటోనిన్‌పై పనిచేసి నొప్పిని తెలియనివ్వదు. మత్తుకోసం యువత ఇలాంటి మందులను కొన్ని దుకాణదారులతో లాలూచీ పడి కొనుగోలు చేస్తున్నారని తెలిసింది. పెరుగుతున్న కిడ్నీ బాధితులు.. నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వినియోగించడంతో మూత్రపిండ బాధితులు పెరుగుతున్నారని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో అధికారికంగా 498 మంది ఉండగా అనధికారికంగా మరో వెయ్యి మంది వరకు ఉంటారు. అధిక మోతాదులో ఔషధాలు వాడటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మందుల చీటీ లేకుండా విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తణుకు ఔషధ నియంత్రణాధికారి మల్లికార్జునరావు తెలిపారు.

డివిజన్ల వారీగా జిల్లాలో మందుల దుకాణాలు
నరసాపురం 800 భీమవరం 600

# నగరాన్ని గాలికొదిలేసి..



విశాఖపట్నం: విశాఖ మహా నగరపాలక సంస్థ(జీవీఎంసీ)కి ప్రస్తుతం కమిషనర్ లేరు. ఇలాంటి సమయంలో మేయర్‌గా ఉన్న గొలగాని హరి వెంకట కుమారి కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. ఉదయం నగరంలో వార్డులు, కాలనీలు సందర్శించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలపై ఆరా తీసి సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. అలాంటి సమయంలో జీవీఎంసీని గాలికొదిలేసి మేయర్, డిప్యూటీ మేయర్‌తో సహా కొంత మంది కార్పొరేటర్లతో వైకాపా క్యాంపు రాజకీయాలకు తెరలేపడం గమనార్హం.

**అటకెక్కిన పారిశుద్ధ్యం:** రెండు నెలల క్రితం కమిషనర్ సంపత్‌కుమార్ బదిలీ అయిన తర్వాత నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కమిషనర్ ఉన్న సమయంలో మేయర్‌తో కలిసి నిత్యం ఉదయం 5-7గంటల వరకు క్షేత్రస్థాయిలో వార్డు, కాలనీలు సందర్శించేవారు. పారిశుద్ధ్య కార్మికుల బయోమెట్రిక్ తనిఖీలు, గెడ్డలు, కాల్వలు అధ్వానంగా ఉన్నచోట పరిశీలించి పరిష్కారం చేసేవారు. ఈ సమయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జోన్ సహాయ వైద్యాధికారి పర్యటనలో ఉండేవారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఏ అధికారీ వెళ్లడం లేదు. కమిషనర్, మేయర్ ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో నగరంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఒకవైపు స్వచ్ఛసర్వేక్షన్-2025కు ర్యాంకు ఇవ్వడానికి కేంద్రం ప్రభుత్వం పంపిన ప్రత్యేక బృందం సర్వే చేస్తుండగా, ఈ సమయంలోనూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో నగర ర్యాంకుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

**ఆగమేఘాలపై అందుకే.. :** జీవీఎంసీ బడ్జెట్ రూ.4,601 కోట్లకు పాలకవర్గం ఆమోదించింది. వాస్తవానికి ఈ బడ్జెట్ ఆమోదానికి మేయర్ అందుబాటులో లేకపోతే, కోరం 33 మంది సభ్యులలో ఒకరిని తాత్కాలిక మేయర్‌గా ఎన్నుకుని బడ్జెట్ ఆమోదం చేసుకునే అవకాశం ఉంది. ఈ విషయం తెలుసుకున్న మేయర్, డిప్యూటీ మేయర్లు ఆగమేఘాలపై బెంగళూరు శిబిరం నుంచి వచ్చారు తప్ప, నగర ప్రజలపై ఎలాంటి ప్రేమ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నేడో, రేపో తిరిగి మళ్లీ ఈ ఇద్దరూ వైకాపా శిబిరానికి వెళ్లనున్నారు.

**హడావుడి శిబిరం ఎందుకో?:** మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి అవసరమైన సంఖ్యా బలం దగ్గరకు కూటమి వచ్చే వరకు ఉండి, ఆ తర్వాత ఆగమేఘాలపై వైకాపా క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. మొత్తం 111లో కూటమికి 73, సీపీఐ, సీపీఎం కలిపి రెండు ఉండగా, వైకాపాకు ఎక్స్‌అఫియో మెంబర్లతో కలుపుకొని బలం 36 ఉంది. ఇందులో బెంగళూరు శిబిరానికి వెళ్లింది 27 మంది మాత్రమే. శిబిరంలో ఉన్న ఈ 27 మందిలో కొందరు కూటమి పార్టీ నేతలతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. **డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసం:** మేయర్‌పై అవిశ్వాసం పెట్టి కలెక్టర్‌ను కలిసిన కూటమి నేతలు తాజాగా డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసానికి అడుగులు వేస్తున్నారు. వైకాపాకు చెందిన డిప్యూటీ మేయర్లు సతీష్, శ్రీధర్‌లపై అవిశ్వాసం పెట్టేందుకు సంతకాలు సేకరిస్తున్నారు. త్వరలో జిల్లా కలెక్టర్‌కు లేఖ సమర్పించే అవకాశం ఉంది. ఈ పదవులకు కూటమిలో కొందరు పోటీ పడుతున్నారు. శాసన సభ్యులు సామాజికవర్గాల వారీగా కొందరు కార్పొరేటర్లను సిఫార్సు చేస్తున్నట్లు సమాచారం.

# సర్పానదిలో కాలనాగులు



రావికమతం : సర్పానది పరివాహక ప్రాంతం సాగు భూమిగా మారుతోంది. వరి, చెరకు, అరటి, కూరగాయలతోపాటు సరుగుడు తోటలు సాగు చేస్తున్నారు. నదిలో ఆక్రమణలు పెరుగుతున్నా.. సంబంధిత యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా ఒకప్పుడు విశాలంగా ఉన్న పరివాహక ప్రాంతం క్రమేణా కుంచించుకుపోయింది. నది గర్భం కొండగెడ్డ, కాలువలా కనిపిస్తోంది.

తూర్పు కనుమల్లోని చింతపల్లి, జి.మాడుగుల అటవీ ప్రాంతం నుంచి రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మీదుగా సుమారు 50 కి.మీ. దూరం ప్రవహించి కోటవురట్ల మండలం వద్ద వరహా నదిలో కలుస్తుంది. కల్యాణపులోవ వద్ద మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. ఈ జలాశయం దిగువన 4484 ఎకరాల ఆయకట్టు ఉంది. రావికమతం మండలం చీమలపాడు మొదలు మాకవరపాలెం వరకు 45 ఎకరాలకుపైగా పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైంది. పలుచోట్ల నది గట్టు తక్కువ ఎత్తులో ఉండటంతో సరుగుడు, యూకలిప్టస్, వరి, అరటి, చెరకు సాగు చేస్తున్నారు. ధర్మవరం వంతెన వద్ద సరుగుడు తోటలు సాగు చేస్తుండగా, కొత్తకోట వంతెనకు సమీపంలో నది పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమణలతో నది కాలువలా మారడం, వరదల సమయంలో ప్రవాహ ఉద్ధృతికి గట్లు కోతకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని జలవనరుల శాఖ కొత్తకోట సెక్షన్ ఏఈ సూర్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా.. 'ఇటీవల బదిలీపై వచ్చా. ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు లేవు. ఆక్రమణలు గుర్తించేందుకు తహసీల్దారుతో మాట్లాడి జాయింట్ సర్వే చేయించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామ'ని చెప్పారు.

వంతెనల చెంతే తవ్వకాలు... నది పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి పంటలు, తోటలు సాగు చేయడమే కాకుండా ఇసుక అక్రమ తవ్వకాలూ యథేచ్ఛగా జరుగుతున్నాయి. ధర్మవరం సమీపంలో ఇసుక తవ్వకాలు జాతరను తలపిస్తున్నాయి. ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై తరలిస్తున్నారు. కన్నంపేట వద్ద కొత్తకోటకు చెందిన కొందరు రోజూ 15 నుంచి 20 వరకు టైరు బళ్లు, ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తున్నారు.

# కోడి.. ధర పరుగిడి..!



నక్కపల్లి : రెండు నెలలుగా కుదుపునకు లోనైన కోడి ధర పౌల్ట్రీ రైతుల మోముపై మళ్లీ ఇన్నాళ్లకు చిరునవ్వు తెచ్చింది. కొత్త అమావాస్య ప్రభావంతో కేజీ రూ.230కు చేరింది. జిల్లాలో 400 వరకు పౌల్ట్రీలు ఉండగా, లక్షల కోళ్ల ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో స్థానిక అవసరాలు పోనూ, మిగిలినవి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. సంక్రాంతి సమయంలో దాదాపు కేజీ రూ. 250 పలికిన ధర ఆ తర్వాత బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కొద్దిరోజులకే ధర పతనమైంది. స్థానికంగా వ్యాధి లేకపోయినా, వదంతులతో కొనుగోలుదారులు వెనుకాడటంతో అమ్మకాలు తగ్గిపోయాయి. దీంతోపాటే ధరలు పడిపోయాయి. ఫలితంగా కేజీ రూ. 150లకు వచ్చేసింది. దాదాపు నెలరోజులు ఇదే పరిస్థితి కొనసాగగా.. రైతుల పరిస్థితి చూసి ప్రభుత్వం, పౌల్ట్రీ యాజమాన్యాలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. ఇది కాస్త అనుకూల మార్పును తెచ్చింది. మార్చి మొదటి వారానికి పరిస్థితి కాస్త కుదుటపడింది. ఫలితంగా రెండు నెలల తర్వాత కిలో మాంసం రూ. 200కు చేరింది. ఇది కేవలం వారం రోజులు మాత్రమే నిలిచింది. తర్వాత కోళ్ల ఉత్పత్తి అధికం కావడం.. డిమాండ్ తగ్గడంతో మరోసారి ధర నేల చూపులు చూసింది. అయినా పౌల్ట్రీ నిర్వాహకులు నష్టాలు చూస్తూనే ధర కొనసాగించారు. ఈలోగా కొత్త కోళ్ల పెంపకం తాత్కాలికంగా ఆపేసి, ఉన్న సరకును విక్రయించారు.

తాజాగా కొత్త అమావాస్య రావడంతో కోడికి గిరాకీ పెరగడంతో ధర కూడా భారీగా ఎగబాకింది. అయిదు రోజుల కిందట కిలో మాంసం ధర రూ. 190 ఉండగా, రెండు రోజుల కిందట రూ. 200 కు చేరింది. ఇక ఆదివారం నాడు ఏకంగా రూ. 230కి విక్రయించారు. అయినా జనాలు వెనుకాడలేదు. పండగ కావడంతో దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. ప్రస్తుతం ఉన్న ధరతో పౌల్ట్రీ నిర్వాహకులకు కాస్త ఊపిరి వచ్చినట్లయింది. ఈ ధర కొనసాగే అవకాశం కనిపిస్తోంది. మరో రెండు వారాల్లో సముద్రంలో చేపలవేట నిలిచిపోనుంది. దీనికి తోడు రానున్న రోజుల్లో శుభకార్యాలు ఉన్నాయి. అంతేకాకుండా ఎండల తీవ్రత కారణంగా కోళ్లు చనిపోతుంటాయి. ఫలితంగా డిమాండ్‌కు తగిన సరకు లేక ధర నిలకడగా కొనసాగే అవకాశం ఉందని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు.


# మట్టికొట్టుకుపోతున్నారు!

వరదయ్యపాళెం : అధికారుల అలసత్వం మట్టి మాఫియాకు వరంగా మారింది. సత్యవేడు మండలం చెన్నేరి, వానెల్లూరు వద్ద వైకాపా హయాంలో అనుమతులు పొందామంటూ మట్టి తవ్వి పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారు. పత్రాలు చూపాలంటే ఎదురుదాడి చేస్తున్నారు. రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే వాటి గురించి తమకు తెలియదంటున్నారు. భూగర్భ గనుల శాఖను సమాచారం అడిగామని వారి నుంచి సమాధానం వచ్చిన తర్వాత చర్యలకు ఉపక్రమిస్తామని తాత్సారం చేయడం విమర్శలకు తావిస్తోంది. సత్యవేడు మండలం చెన్నేరి, వానెల్లూరు వద్ద ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు నెలరోజులుగా జోరుగా సాగుతున్నాయి. తవ్విన మట్టిని తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రశ్నిస్తే తమకు అనుమతులున్నాయంటూ బుకాయిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు చూపాలని కోరుతున్నా, మీరేమైనా అధికారులా.. ఎందుకివ్వాలంటూ ఎదురుదాడి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలా నిత్యం వందల వాహనాల్లో తమిళనాడుకు తరలిస్తున్నా, అధికారులు మౌనం దాల్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**రహదారులు ఛిద్రం** నిత్యం భారీ మట్టి వాహనాలతో సత్యవేడులోని రహదారులు ఛిద్రమయ్యాయి. ఇటీవల భాజపా నాయకులు సైతం గ్రావెల్ వాహనాలను అడ్డుకుని ఆందోళన చేసినా అధికారులు స్పందించలేదు. ఈ విషయమై తహసీల్దార్ రాజశేఖర్‌ను వివరణ కోరగా గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతులపై నివేదిక ఇవ్వాలని భూగర్భగనుల శాఖ అధికారులను కోరామన్నారు. వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇక్కడ పేరు.. అక్కడ చదువు

పాడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి కొన్నిచోట్ల ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. పిల్లల పేర్లు మాత్రమే తమ పాఠశాలల్లో చూపిస్తున్నారు.. వారి చదువులు మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో సాగించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. నర్సీపట్నం మండలంలో కేబీపాలెం, నగరం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సంధ్య, సూర్యప్రకాశ్‌ల పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు పంపించి ప్రభుత్వ పాఠశాలల్లో చూపించడంతో వారిద్దరిపై వేటు వేశారు. చోడవరం మండలంలోనూ కొంతమంది ఉపాధ్యాయులు ఈ తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి చర్యలకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తో గురువుల లీలలు బయటపడుతున్నాయి. వాటిపై ప్రాథమిక విచారణ చేపట్టి ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఈ తరహా అక్రమాలు చాలానే జరిగినట్లు గుర్తించినా ఆ వివరాలు బయటకు




రాకుండా విద్యాశాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గతేడాది మొదలుపెట్టిన అపార్ నమోదు ఇప్పటికీ పూర్తికాకపోవడానికి విద్యార్థుల లెక్కలు తేలకపోవడం కూడా ఓ కారణమని సంబంధిత అధికారులే చెబుతున్నారు.

**ప్రవేశాల్లో మాయాజాలం..** విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ఆయా పాఠశాలల్లో పోస్టులు కోతపెడతారని కొంతమంది ఉపాధ్యాయులు ప్రవేశాలను (అడ్మిషన్లు) రికార్డుల్లోనే చూపిస్తున్నారు. వారు బడికి రాకపోయినా హాజరుపట్టీలో మాత్రం వచ్చినట్లే టిక్ పెట్టేస్తున్నారు. నవోదయ, సైనిక్ పాఠశాలలు, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకే ఎక్కువ అవకాశం కల్పిస్తుంటారు. దీనికోసం ప్రైవేటు స్కూల్ పిల్లలను కొన్నిచోట్ల సర్కారీ బడుల్లో చదువుతున్నట్లు చూపిస్తున్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 1,97,049 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,55,809 మంది వివరాలు అపార్‌లో నమోదు చేశారు. ఇంకా 41,418 మంది పెండింగ్‌లో ఉన్నారు.

**మిగతా వారిపై దృష్టి..** ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి జూనియర్ కళాశాల విద్యార్థుల వరకు 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' ఐడీ పేరిట అపార్ నమోదు చేయిస్తోంది. ఒక విద్యార్థి అడ్మిషన్ ఒకే చోట ఉండాలి.. రెండు మూడుచోట్ల చూపడానికి వీల్లేదు. ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి అపార్ నమోదులో అనధికార విద్యార్థులు వెలుగులోకి వస్తున్నారు. ఈ విషయమై డీఈవో అప్పారావునాయుడు వద్ద ప్రస్తావించగా పరీక్షలు దగ్గర పడడంతో అపార్ నమోదుపై ఒత్తిడి తగ్గించారని, అందుకే ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. అనధికార విద్యార్థుల వివరాలు కొన్నిచోట్ల వెలుగు చూడగా ఇద్దరిపై చర్యలు తీసుకున్నామని మిగతా వారిపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చేందుకు యత్నించగా ఉపాధ్యాయులు అందుబాటులో లేరని ఎంఈవో తలుపులు చెప్పారు.

# పల్లె పయనం.. ఇక పదిలం

నంద్యాల : కొన్నేళ్లుగా నిర్వహణ, మరమ్మతులు కరవై దారుణంగా దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మోక్షం కలుగనుంది. ఇటీవల ఆర్‌అండ్‌బీ రహదారులపై గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టింది. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఈ రహదారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొత్త రహదారులు వేయకపోగా.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో చాలా గ్రామాల పరిధిలో రోడ్లు రూపు కోల్పోయాయి. త్వరలో నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంబంధిత శాఖ అధికారులను ప్రతిపాదనలు పంపాలని ఇటీవల ఆదేశించింది.

**ఐదేళ్లు పట్టించుకోలేదు** జిల్లా పంచాయతీరాజ్‌లో రెండు విభాగాలు ఉన్నాయి. పీఐయూ నుంచి 49 రోడ్లకు ప్రతిపాదనలు పంపారు. 183.01 కి.మీల పొడవున మరమ్మతులకు రూ.68.56 కోట్లతో ప్రతిపాదించారు. పీఆర్ డివిజన్ నుంచి 47 రోడ్లకు 184.94 కి.మీల పొడవున మరమ్మతులు చేసేందుకు రూ.83.06 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ బాగా దెబ్బతిన్న బీటీ రోడ్లే. వీటిని గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేకపోవడంతో ఛిద్రమయ్యాయి. కొన్ని రహదారులపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. మరికొన్ని రహదారులపై తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు దర్శనమిస్తున్నాయి. పంట పొలాల మధ్య వేసిన రహదారులు కోతకు గురవడంతో వీటిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

**ఎట్టకేలకు వీటికి మోక్షం**

పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలంలో ఎనిమిది చోట్ల రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి నంద్యాల- నందికొట్కూరు రోడ్డు నుంచి భోగేశ్వరం రహదారి వరకు 4.17 కి.మీల పొడవున దారి దారుణంగా ఉంది. గని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పైభోగుల రోడ్డు, ఎన్‌ఎన్ రోడ్డు నుంచి- బిలకలగూడూరు వరకు దారి ఛిద్రమైంది. 6.9 కి.మీ ఉన్న చిందుకూరు- పరమటూరు రోడ్డు కూడా అధ్వానంగా మారింది. మంచాలకట్ట- ఎల్‌కే తండా రహదారి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలంలో ఈర్నపాడు- మణికంఠాపురం మధ్య 4 కి.మీ, మణికంఠాపురం- ఓంకారం మధ్య 3.3 కి.మీ, బండిఆత్మకూరు- ఈర్నపాడు మధ్య 11 కి.మీల పొడవున్న రోడ్లను బాగు చేయాలని ప్రతిపాదించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం మహదేవపురం నుంచి కె.కొత్తూరు వరకు 2.58 కి.మీలు, బాచపల్లి నుంచి అహోబిలం వరకు 9 కి.మీల ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు రానున్నాయి.

నంద్యాల మండలంలోని పోలూరు- రాయమాల్పురం, అయ్యలూరు- మసీదుపురం, గోస్పాడు మండలం జిళ్లెల్ల- పసురపాడు రోడ్డును మరమ్మతులు చేయనున్నారు.

# ఉ అంటే.. ఊడ్చేస్తారు

విజయనగరం: ఫోన్ చేసి ఉద్యోగాలు, రుణాలు, కమీషన్లు, కార్డులు, లాటరీల పేరిట ఒకప్పుడు నగదు కాజేసేవారు.. కొన్ని రోజులుగా కేటుగాళ్లు రూటు మార్చారు.. వ్యక్తిగత, కుటుంబ, బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ వివరాలను సేకరించి పక్కా సమాచారంతో సంప్రదిస్తున్నారు.. మత్తు పదార్థాలు, నిషేధిత వస్తువులను సరఫరా చేస్తున్నారని, మీరు ఆర్డరు చేసిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని నమ్మబలుకుతూ రూ.లక్షలు కాజేస్తున్నారు.. ఇవే డిజిటల్ అరెస్టులు. కేంద్ర ప్రభుత్వం సైతం ఇప్పటికే ఇలాంటి కేసులపై అప్రమత్తమైంది.

**ఏం చేస్తారంటే..**

కేటుగాళ్లు ముందుగానే పూర్తిస్థాయి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం సంప్రదిస్తారు. మీ కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరిని అరెస్టు చేస్తామని బెదిరిస్తారు. లేకపోతే మిమ్మల్నే కేసులో ఇరికిస్తామని పేర్కొంటారు. ఉన్నతాధికారి విచారణ చేస్తున్నారని, వివరాలు చెప్పాలని నమ్మబలుకుతారు. అలా ఖాతాలో నగదు కాజేస్తారు. గత అయిదు నెలల్లో విజయనగరం జిల్లాలో ఇలాంటివి పది కేసులు నమోదు కాగా.. అందరూ నగదు పోగొట్టుకున్నారు. విజయనగరం జిల్లాలో నవంబరు వరకు ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన ఆర్థిక మోసాలపై 93 కేసులు నమోదయ్యాయి. మన్యంలో 21 కేసులను గుర్తించారు.

'సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరిగితే ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉంటారు. లఘుచిత్రాలు ప్రదర్శించి అప్రమత్తం చేస్తున్నాం. బాధితులుంటే పోలీసులను గానీ, 1930ను గానీ సంప్రదించాలి' అని ఎస్పీలు వకుల్ జిందాల్, మాధవరెడ్డి తెలిపారు.

**అప్రమత్తత ఇలా..**

గుర్తుతెలియని నంబర్ల నుంచి కాల్ వస్తే స్పందించకపోవడం మంచిది. పోలీసులు గానీ, ఇతర శాఖల అధికారులు గానీ ఆన్‌లైన్‌లో, చరవాణుల్లో విచారణ చేయరు. గూగుల్‌పే, ఫోన్‌పే తదితర యూపీఐ ఆధారిత యాప్‌లకు ఎప్పటికప్పుడు పాస్‌వర్డులను మార్చాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతాల వివరాలు గానీ, ఓటీపీలు గానీ చెప్పకూడదు ఒకవేళ సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలి ప్లస్ గుర్తు తరువాత పదకొండ అంకెల నంబర్లు ఉంటే ముప్పుగా పరిగణించాలి హేష్ తరువాత 90, 09 తదితర నంబర్లను డయల్ చేయమంటే అప్రమత్తం కావాలి.

# బహుళ ప్రయోజనం.. సృజనకు దర్పణం

విజయనగరం : ఉమ్మడి జిల్లా పాలీటెక్ ఫెస్ట్ వేదికగా డిప్లొమా విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ప్రభుత్వం ఇస్తున్న సోలార్ సబ్సిడీని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? పరిశ్రమల్లో ప్రమాదాలు తగ్గించే విధానం? బహుళ అవసరాలకు డ్రోన్ల వినియోగంపై విద్యార్థులు ప్రదర్శనల రూపంలో తెలియజెప్పారు. మహారాజా ఆనంద గజపతిరాజు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఫెస్ట్ ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు 62 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కొన్ని ప్రాజెక్టుల గురించి వారి మాటల్లోనే..

**రోబోటిక్ ఆర్మ్** పరిశ్రమల్లో మానవ ప్రమాదాలు తగ్గించడమే ఉద్దేశం. పని ప్రదేశాల్లో కొన్ని తప్పిదాల వల్ల కార్మికులు గాయపడుతున్నారు. కొందరు చనిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మనిషి చేసేది రోబోట్ చేస్తోంది. సరకుల తరలింపు, కూర్పు వంటి పనులు రోబోటిక్ ఆర్మ్ ద్వారా చేయొచ్చు. ఎం.సుమన్, కె.గ్రీష్మన్, ఎస్.రఘురాం, పి.రవీంద్ర, డిప్లొమా విద్యార్థులు, అవంతి కళాశాల, చెరుకుపల్లి

**ఆన్‌లైన్ యూపీఎస్ సిస్టమ్**

ప్రస్తుతం ఉపయోగిస్తున్న యూపీఎస్ విద్యుత్తుపై పనిచేస్తుంది. దీనిలో ఆన్‌లైన్ విధానంలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరుగుతుంది. బ్యాటరీని ఛార్జి చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో వాడుకకు బాగుంటుంది. డేటా సెంటర్లు, టెలికాం, ఆసుపత్రులు, పరిశ్రమల్లో ఉపయోగకరం. – మహేంద్రప్రసాద్, వైష్ణవి, వెంకట్, మహారాజా ఆనంద గజపతిరాజు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం



**పెడల్ పవర్ ఎలక్ట్రిసిటీ జనరేటర్**

యాంత్రిక శక్తిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం. 12 కేవీ మోటార్, సైకిల్ పెడల్, చక్రం సహాయంతో ఉత్పత్తి చేసే విధానాన్ని ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం. విద్యుత్తు సౌకర్యం కల్పించలేని మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలకు అనువైనది. ఆరోగ్యపరంగా ప్రయోజనాలున్నాయి.

– హిమసాగర్, జగన్‌మోహన్, ప్రదీప్, సాయి, అక్షర పాలిటెక్నిక్ కళాశాల, బొండపల్లి

**మల్టీపర్పస్ డ్రోన్లు** డ్రోన్లను బహుళ అవసరాలకు ఉపయోగించే విధానాన్ని తెలియజేశాం. పురుగు మందులు పిచికారీ, భూముల సర్వే, పంట పర్యవేక్షణ, మందుల సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ రక్షణరంగాల్లో దీనిని ఉపయోగించవచ్చు. ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం.– భోజరాజు, వంశీ, సాయి శ్రీనివాస్, సూరిబాబు, ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

**మల్టీపర్పస్ డ్రోన్లు** డ్రోన్లను బహుళ అవసరాలకు ఉపయోగించే విధానాన్ని తెలియజేశాం. పురుగు మందులు పిచికారీ, భూముల సర్వే, పంట పర్యవేక్షణ, మందుల సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ రక్షణరంగాల్లో దీనిని ఉపయోగించవచ్చు. ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం. – భోజరాజు, వంశీ, సాయి శ్రీనివాస్, సూరిబాబు, ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

సోలార్ విద్యుత్తును ఉపయోగించి పంటలకు పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. గంటకు 140 లీటర్లు పిచికారీ చేసేలా దీన్ని రూపొందించాం. రూ.2000– రూ.2,500 బడ్జెట్‌లో అందుబాటులోకి తెస్తే చిన్న రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. – బి.బాలాజీ, జి.భానుప్రకాష్, పి.వి.ఎన్.కమలేశ్, కె.సాయికుమార్, ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాల, గుమ్మలక్ష్మీపురం

**పవర్ ఆఫ్ హైవోల్టేజీ**తక్కువ వోల్టేజీని ఎక్కువ వోల్టేజీగా మార్చుకోవచ్చు. పీడబ్ల్యూఎం సర్క్యూట్, ఫ్లైబ్యాక్ టాన్స్‌ఫార్మర్‌ను ఉపయోగించడం ద్వారా మార్పు వస్తుంది. ఇంట్లో తీగలు ఉపయోగించకుండా విద్యుత్తు వినియోగం, పరిశ్రమల్లో అవసరాలు, ఉపగ్రహాల్లో ఆవశ్యకతను తెలియజేశాం.– ఎం.ఎస్.ఎస్.సోమేశ్, కె.జస్వంత్, ఎ.శివప్రసాద్, డి.సాయిగణేష్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, చీపురుపల్లి

# హామీలు సరే.. వంతెన ఏదీ..?

పెనుమూరు : ప్రభుత్వాలు, పాలకులు మారిన ప్రతిసారి సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. చివరకు వాటిని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ కోవకు చెందినదే పెనుమూరు–పూతలపట్టు మండలాలను కలిపే తూపల్లె వద్ద భీమా నదిపై వంతెన నిర్మాణం. గత జడ్పీ ఛైర్మన్ గీర్వాణి, వైకాపా ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నారాయణస్వామి ఇచ్చిన హామీలు నేటికీ నీటి మూటగానే మిగిలిపోయాయి.

**ప్రజలకు తిప్పలు..**

పాకాల, పులిచర్ల, పూతలపట్టు మండలాల్లో కురిసే భారీ వర్షాలకు బీమా నదికి వరద వస్తుంది. ఈ వరద నీరు నేరుగా ఎన్టీఆర్ జలాశయంలోకి చేరుతుంది. ఈ మధ్యలో మండలంలోని తూపల్లె వద్ద పెనుమూరు–పూతలపట్టు మండలాలను కలిపేందుకు నదిలో రహదారి ఉంది. వరద వచ్చిన ప్రతిసారీ ఈ రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో మండలానికి చెందిన చిన్నకలికిరి పంచాయతీ ప్రజలకు మండలానికి రావాలంటే వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఇక మండలంలోని కలికిరి, నంజరపల్లె, లక్కలపూడివాండ్ల ఊరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కూలీలు చిత్తూరు, తిరుపతి వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు.

**నేతల హామీ గాలికి..**

భీమా నదిపై వంతెన నిర్మించి ప్రజల ఇక్కట్లు తొలగిస్తామని నేతలు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. తెదేపా హయాంలో చిత్తూరు జడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన గీర్వాణి.. ఓసారి నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆ సమయంలో జడ్పీ నిధులతో వంతెన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తరవాత అతీగతీ లేకుండా పోయింది. గత వైకాపా పాలనలో ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన అప్పటి స్థానిక ఎమ్మెల్యే నారాయణస్వామి సైతం సమస్య పరిష్కరించేందుకు వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మాట ఇచ్చినా నీటి మూటలాగా నదిలో కొట్టుకు పోయిందనే చెప్పాలి. ఇటీవల రెండుసార్లు రోడ్డు కోతకు గురికావడంతో దాతల సాయంతో బాగు చేశారు.



**నది ప్రవహిస్తే అవస్థలే..**

భీమా నది ప్రవహించిన ప్రతిసారీ రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. నాయకులు హామీలు ఇస్తున్నా ఆ తరవాత పట్టించుకోవడంలేదు. దాదాపు 15 గ్రామాల ప్రజలు పనులకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి పాలకులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నీరజాక్షులునాయుడు, ఎల్లంపల్లె

**ఇబ్బందులు పడుతున్నాం..**

నదికి వరద వచ్చి రోడ్డు కోతకు గురైతే మాకు తిప్పలు తప్పవు. ఏదైనా పనిమీద మండల కేంద్రానికి వెళ్లాలంటే 30 కిమీ. ప్రయాణం చేయాలి. దీంతో అన్నివిధాలా నష్టపోతున్నాం. అధికారులు చొరవ తీసుకుని వంతెన త్వరితగతిననిర్మిస్తే ఇక్కట్లు తీరుతాయి. ముత్తుకుమార్, చిన్నకలికిరి

# నిధులొస్తే మరింత ఊపు



ముమ్మిడివరం: వైకాపా అయిదేళ్ల పాలనలో అస్తవ్యస్తంగా మారిన రహదారులను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో 'పల్లె పండుగ' పథకంలో గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంటు రహదార్లు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టగా వివిధ కారణాలతో పూర్తికాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నా బిల్లులు రాకపోవడంతో పనులు మందగించాయి.

**గత వైఫల్యాలు వెంటాడుతూ..**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గత ఏడాది అక్టోబరు 14న రూ.88.17 కోట్లతో 1,002 పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 60 శాతం పనులే పూర్తయ్యాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారానే నడుస్తోంది. గత పాలకులు ఈ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఇతర పథకాలకు మళ్లించడం.. నిబంధనలు సక్రమంగా పాటించక పోవడంతో ఏపీలో దీని నిర్వహణపై కేంద్రానికి నమ్మకం సడలింది. ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు అప్పట్లో బిల్లులు ఇవ్వకపోవడంతో చాలామంది ఇబ్బందులకు గురయ్యారు. ఆ భయం ప్రస్తుత గుత్తేదారులనూ వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకం నిధులు గ్రామ సభల తీర్మానాలకు అనుగుణంగా చేపడుతున్నారు.

**మొదట్లో బాగానే వచ్చినా..**

పల్లె పండుగలో చేపట్టిన సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణానికి మొదట్లో బిల్లుల సమస్య లేదు. పని ప్రారంభించిన తర్వాత ఉపాధి హామీ పథకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే బిల్లులు వచ్చేవి. ప్రతి గురువారం చెల్లింపులు జరిగేవి. ఇప్పటి వరకు రూ.34 కోట్లు విలువ చేసే పనులు పూర్తికాగా, రూ.6.91 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తిచేశారు. మిగతావాటికి అందాల్సి ఉంది ఇది పనులపై ప్రభావం చూపుతోంది. **పూర్తి చేసేందుకు చర్యలు**

పల్లె పండుగలో చేపట్టిన రహదారుల నిర్మాణం ఈ నెలాఖరునాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం బిల్లుల చెల్లింపు నిలిచినా, త్వరలోనే నిధులు విడుదలవుతాయి. ప్రస్తుతం చాలా వరకు పనులు ప్రారంభించారు. వాటిని పూర్తి చేయడంపై దృష్టి సారించాం. పి.రామకృష్ణారెడ్డి, ఈఈ పంచాయతీరాజ్, అమలాపురం

# సమయం లేదు మిత్రమా..

కాకినాడ : గత వైకాపా పాలనలో గ్రామాలను పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను జగన్ సర్కారు ఇతర పనులకు వాడుకుంది. పల్లె పాలనను పూర్తిగా అటకెక్కించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులున్నా ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లె పండగ పేరుతో వీటిపై దృష్టి సారించింది. పల్లె దారులు చక్కదిద్దడానికి సంకల్పించింది. రూ.61.31కోట్ల విలువైన 537 పనులు పూర్తి చేయాలి. మార్చి 31లోగా పూర్తి చేసి, బిల్లులు సమర్పిస్తేనే మంజూరైన నిధులు మనుగడలో ఉంటాయి. ఇంకా నెల మాత్రమే ఉన్న నేపథ్యంలో త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

**123 కి.మీ.రోడ్డు నిర్మించారు..**

పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షిస్తుండగా జిల్లా నీటియాజమాన్య సంస్థ నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.120.54 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకు రూ.59.23 కోట్ల విలువైన పనులు పూర్తి చేయగా, రూ.45.52కోట్ల మేర బిల్లుల చెల్లింపు, ఎఫ్‌టీవోలు జారీ చేశారు. 195.96 కి.మీ. రహదారి నిర్మాణానికి గాను 123.52 కి.మీ. నిర్మించారు. 1,279 పనులకు 742 పూర్తి చేశారు. కొన్నిచోట్ల శంకుస్థాపనలు జరిగినా, పనులు చేపట్టలేదు. త్వరగా పూర్తి చేసేలా ఈ రెండు శాఖల సమన్వయం తప్పనిసరి. **నియోజకవర్గాల వారీగా ఇదీ పరిస్థితి..**

పిఠాపురం నియోజకవర్గంలో 370 పనులకు 202 మాత్రమే పూర్తయ్యాయి. జగ్గంపేట నియోజకవర్గంలో 98 పనులకు 28 పూర్తి చేశారు. జగ్గంపేట మండలంలో 52 పనులకు 6, కిర్లంపూడి మండలంలో 29 పనులకు 8 మాత్రమే పూర్తయ్యాయి.

తుని నియోజకవర్గంలో 253 పనులకు 156 పూర్తి చేశారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్లరేవు మండలంలో 37 పనులకు 9 పూర్తయ్యాయి.



అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో 35 పనులకు 30, రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరులో 27 పనులకు 22 జరిగాయి.

పెద్దాపురం నియోజకవర్గంలో 51 పనులకు 15 మాత్రమే పూర్తయ్యాయి. కాకినాడ గ్రామీణం నియోజకవర్గంలో 262 పనులకు 152 అయ్యాయి.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 146కు 128 పూర్తి చేశారు.

త్వరగా పూర్తి చేస్తాం..సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేస్తాం. నెల వ్యవధిలో అన్నింటిని సాకారం చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు పొందుపరుస్తున్నాం. నాణ్యతతో జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. ఏవీఎస్ శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతీరాజ్‌శాఖ, కాకినాడ జిల్లా

# పాపం.. పోషకలోపం

విజయనగరం : పిల్లల ఎదుగుదలలో ఏడాది నుంచి అయిదేళ్ల లోపు వయసు అత్యంత కీలకం. ప్రస్తుతం పోషకాహార సమస్యతో వేల మంది చిన్నారులు బాధపడుతున్నారు. సరైన ఆహారం తీసుకోకపోవడం, సదుపాయాల కొరత, పేదరికం, తల్లిదండ్రుల జీవన పరిస్థితులే అందుకు కారణాలు. వారిని సకాలంలో గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలి. ఆ బాధ్యత ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీల సిబ్బందిదే. వారి నుంచి స్పందన లేకపోవడంతో తల్లిదండ్రులు కేంద్రాలకు తీసుకు రావడం లేదు.

**ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..**

ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగ్గ బరువు లేకున్నా, చేతులు కర్రపుల్లలా కనిపించినా, కడుపు ఎత్తుగా ఉండి చుట్టూ ఎముకలు గూడు



తలపించేలా ఉన్నా, 8 గ్రాముల కంటే తక్కువ రక్తం ఉంటే వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి. అటువంటి వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ ఆట పాటలతో పాటు పుష్టిగా భోజనం పెడుతూ ఉచిత వైద్యం, కౌన్సెలింగ్ అందిస్తూ సాధారణ పిల్లల్లా మారుస్తారు. ప్రస్తుతం విజయనగరంలోని ఘోషాసుపత్రిలో సేవలు కొనసాగుతున్నాయి.

**ఆర్థిక సాయం..**

ఆరు నెలల నుంచి అయిదేళ్ల లోపు పిల్లలను తీసుకెళ్లవచ్చు. 60 రోజుల పాటు వారికి సేవలు ఉంటాయి. 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేస్తారు. వాటి ఆధారంగా వైద్యం చేస్తారు. పిల్లలను తీసుకొచ్చే వారికి రోజుకు రూ.100 చొప్పున ఇస్తారు. ఇతర సిబ్బంది వెంట వస్తే వారికి అదనంగా రూ.50 అందజేస్తామని ఎన్ఆర్‌సీ పర్యవేక్షకులు ప్రతిరా, విజయలక్ష్మి తెలిపారు. పాలు, కిచిడీ, బెల్లంతో చేసిన హల్వా, ఉడకబెట్టిన ఎర్రదుంపలు, శనగపిండితో చేసిన పదార్థాలు, ఆకు కూరలతో భోజనం అందిస్తామన్నారు. ప్రతి 2 గంటలకోసారి ఇలాంటి బలవర్ధక ఆహార పదార్థాలు ఇస్తామని పేర్కొన్నారు.

# 5 ఏళ్ల 'నిధి'రాత

నంద్యాల : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా సాగు నీటి వనరుల నిర్వహణను వదిలేసింది.. ప్రపంచ బ్యాంకు, సింప్, జైకా వంటి సంస్థలు ముందుకొచ్చినా స్పందించలేదు.. రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వకపోవడంతో పనులు గట్టు దాట లేదు.. ఫలితంగా చెరువులు చెదిరాయి.. కాల్వలకు గండ్లు పడ్డాయి.. సాగు నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. పనులు పూర్తి చేసి ఉంటే కేసీ కాల్వ పరిధిలో 1.65 లక్షల ఎకరాలు, చెరువుల పరిధిలో 81,629 ఎకరాలకు నీరు సాఫీగా అందేది.

**జైకా జారిపోయింది**

ఉమ్మడి జిల్లాలో వరదల తాకిడికి దెబ్బతిన్న చెరువులు మరమ్మతులు చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి జపాన్ అంతర్జాతీయ



సహకార సంస్థ (జైకా) ముందుకొచ్చింది. నంద్యాల జిల్లాలో ఒక చెరువును రూ.1.50 కోట్లు, కర్నూలు జిల్లాలో 16 చెరువులను రూ.2 కోట్లతో బాగు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు.

**'సింప్'లుగా వదిలేశారు**

ఇటీవల నిర్వహించిన సాగునీటి పారుదల సలహా సంఘం సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని మంత్రులు ఆదేశించారు.

కర్నూలు– కడప ప్రధాన కాల్వ దెబ్బతిన్నది.. 305 కి.మీ. పొడవునా లైనింగ్‌ను బాగు చేసేందుకు రూ.550 కోట్లతో అధికారులు ప్రతిపాదించారు. సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం చివరి ఆయకట్టు వరకు లైనింగ్ దెబ్బతిన్న తీరును అధికారులు నివేదికలో సమర్పించారు.

స్పందించిన కేంద్రం సపోర్ట్ ఫర్ ఇరిగేషన్ మాడరైజేషన్ ప్రోగామ్ (సింప్) కింద నిధులు విడుదల చేసేందుకు ముందుకొచ్చింది. కేంద్రం 85 శాతం నిధులిస్తే రాష్ట్రం 15 శాతం వెచ్చించాల్సి ఉంటుంది. వైకాపా ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వకపోవడంతో పనులు జరగలేదు. ప్రధాన కాల్వ 0 నుంచి 25 కి.మీ. వరకు లైనింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. వేల్పనూరు నుంచి సంతజూటూరు వరకు 12 కి.మీ. మేర పూర్తిగా చెడిపోయింది.

చెరువుకు చేరని నిధులు

ఇప్పటి వరకు ఎనిమిది చెరువుల వద్దే పనులు చేశారు. కరివేముల, తంగడంచ, ఉప్పలపాడు, నేతలమర్రి, పత్తికొండ ఊరి చెరువు పనులు ప్రారంభమే కాలేదు.

ఉమ్మడి జిల్లాలో 31 చెరువులను పునరుద్ధరించి ఆరు వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఏటీసీ) కింద నిధులిచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.52.04 కోట్లు.. ఇందులో ప్రపంచ బ్యాంకు వాటా 70 శాతం, రాష్ట్ర వాటా 30 శాతం. వైకాపా హయాంలో పట్టించుకోలేదు.

రుద్రవరం మండలంలో 2, ఆళ్లగడ్డ 2 , అవుకు, జూపాడుబంగ్లా, బండిఆత్మకూరు, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, గడివేముల, జూపాడుబంగ్లా, డోన్ మండలాల్లో ఒక్కొక్క చెరువును ఎంపిక చేశారు. దేవనకొండ మండలంలో రెండు, ఆదోనిలో మూడు, పత్తికొండ, హొళగుంద, ఆస్పరి, సి.బెళగల్, కృష్ణగిరి, వెల్దుర్తి, కౌతాళం, హాలహర్వి, ఆలూరులలో ఒక్కోటి బాగు చేయాలని నిర్ణయించారు.

# నియంత్రికలు మండుతున్నాయ్..!

చిత్తూరు : వేసవి మొదలుకాక ముందే ఎండ వేడిమి తీవ్రమవడంతో విద్యుత్తు డిమాండ్ మరింత పెరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యుత్తు వినియోగం 172.02 మిలియన్ యూనిట్ల(ఎంయూ)కు చేరింది. లోవోల్టేజీ, అధిక లోడు తదితర కారణాలతో నియంత్రికలు మండుతున్నాయి. రైతులు, వినియోగదారులకు సమస్య తలెత్తకుండా మరమ్మతు చేసి వెంటనే అందజేసేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

జిల్లాలో ఫిబ్రవరి నెలలోనే 320 నియంత్రికలు దగ్ధమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. వైకాపా హయాంలో విద్యుత్తుశాఖను అక్రమార్కులకు నిలయంగా మార్చిన నేతలు లైన్ల నిర్వహణ, అధిక లోడు, లోవోల్టేజీ సమస్యను అరికట్టడం తదితర విషయాలను గాలికొదిలేశారు. అవసరం లేని చోట ఉప కేంద్రాల ఏర్పాటు చేసి.. సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్త వాటి ఏర్పాటు పట్టించుకోలేదు. ఫలితంగా వేసవిలో



నియంత్రికలు దగ్ధమవుతున్నాయి.

సమస్య ఎక్కడంటే.. పెనుమూరు, పాలసముద్రం, గంగాధరనెల్లూరు, ఐరాల, పూతలపట్టు, ఐరాల మండలాలతో పాటు పలమనేరు తదితర ప్రాంతాల్లో పరివర్తకాలు అధికంగా దగ్ధమవుతున్నాయి. వాటిని చిత్తూరు, పలమనేరు, పుంగనూరులోని కేంద్రాలకు తరలించి నిర్దేశిత గడువులోగా మరమ్మతులు చేస్తున్నారు. అవసరమైన కాపర్ వైండింగ్ వైరు, ఆయిల్ తదితర ముడి వస్తువుల కొరత లేకుండా జాగ్రత్త పడుతున్నామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

# ఇంటి నుంచి పనిచేస్తారా?

తిరుపతి : మీరు వర్క్ ఫ్రం హోం చేస్తున్నారా? మీకున్న సమస్యలేంటి? ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కావాలి? రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు ఉండి, ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన, విద్యార్హత కలిగిన వారికి వర్క్ ఫ్రం హోం ద్వారా మెరుగైన ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సచివాలయాల సిబ్బంది వెళ్లి వారి వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల పదో తేదీలోగా సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆపై కార్యాచరణ రూపొందించి అమలు చేయనుంది. తగిన విద్యార్హత ఉన్నవారు ఐటీ/ ఐటీఈఎస్/ ఇతర అనుబంధ సంస్థల్లో పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నారా? అనేది తెలుసుకోనున్నారు. వారు ఇంటి నుంచే పనిచేయడానికి ఎలాంటి సదుపాయాలు కావాలని అడుగుతున్నారు.

ఒకే ప్రాంతంలో ఎక్కువ మంది సుముఖంగా ఉంటే అలాంటిచోట ఒక సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో 20 నుంచి 25 మంది పనిచేసేలా వసతులు కల్పించనుంది. సర్వే



పూర్తయ్యాక వివిధ ఐటీ సంస్థలను ప్రభుత్వం సంప్రదించనుంది. వర్క్‌ఫ్రం హోం విధానాన్ని విస్తృతపరచడానికి ప్రభుత్వం యత్నిస్తోంది. వివిధ సంస్థల ద్వారా ప్రస్తుతం ఇళ్ల నుంచి పనిచేస్తున్న వారినుంచి పలు వివరాలు సేకరిస్తోంది.

జిల్లాలో ఇప్పటి వరకు సర్వే చేసిన సచివాలయాలు: 691
సర్వే ముగిసిన వ్యక్తులు: 45,964 మంది
వర్క్‌ఫ్రం హోం చేస్తున్న వారిసంఖ్య: 1317 మంది

# అశాస్త్రీయం.. అవస్థలమయం

రాజమహేంద్రవరం : జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధుల విషయంలో అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల కక్షిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్థిరాస్తి దస్తావేజుల(డాక్యుమెంట్ల) రిజిస్ట్రేషన్లకు వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. ఏన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ పరిధుల విషయంలో ఉన్న లోపాలు సరిచేయకపోవడంతో నేటికీ సమస్యగానే మిగిలింది. జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వీటిలో రోజుకు 250 నుంచి 300 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కొందరు స్థిరాస్తి క్రయ,విక్రయదారులు కూడా తమ పరిధిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దూరంగా ఉండటం.. రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వెళ్లాలంటే దూరాభారం కావడంతో ఇబ్బందులు పడ్సాల్సి వస్తుందని అంటున్నారు.

**ఇదీ పరిస్థితి..**కడియం, రాజానగరం, సీతానగరం, పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు కాకముందు ఆయా ప్రాంతాల్లోని స్థిరాస్తులకు సంబంధించిన దస్తావేజుల రిజిస్ట్రేషన్లు రాజమహేంద్రవరంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగేవి. 1995లో కడియం, సీతానగరం, రాజానగరంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పడిన తర్వాత పరిధులు విభజన జరిగినప్పటి నుంచి ఆయా కార్యాలయాల పరిధిలోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు అక్కడే జరుగుతూ వస్తున్నాయి. 2007లో పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్థానిక మోరంపూడి జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేయగా గాడాల, కాతేరు, కోలమూరు, మధురపూడి, నిడిగట్ల, తొర్రేడు, గోకవరం మండలంలోని శివరామపట్నం, పిడింగొయ్యి గ్రామాలను దీని పరిధిలోకి తీసుకొచ్చారు. ఆయా కార్యాలయాల పరిధుల విభజన శాస్త్రీయత లేకుండా అహేతుకంగా జరిగిందనే విమర్శలు గతంలోనే వచ్చినప్పటికీ సరిచేసే ప్రయత్నాలు ఇప్పటివరకు జరగలేదు.

**ఇలా చేస్తే మేలు..**శివరామపట్నం, మధురపూడిలను కోరుకొండ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోకి తీసుకొస్తే కక్షిదారులకు వ్యయప్రయాసలు తప్పుతాయి. రాజమహేంద్రవరం గ్రామీణంలోని శాటిలైట్‌సిటీ, మోరంపూడి, హుకుంపేట, బొమ్మూరు గ్రామాలు కడియం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉండటంతో ఈ గ్రామాల్లోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. అదే ఈ ప్రాంతాలను మోరంపూడి సమీపంలోని పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి తీసుకొస్తే దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు వ్యయప్రయాసలు తప్పుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం లోని డివిజన్లతోపాటు గ్రామీణ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కొన్ని డివిజన్లు కలిసి మొత్తం 90 ప్రాంతాలు నగరంలోని అస్యూరెన్సుల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఒరిజనల్ బ్రాంచి(ఓబీ) పరిధిలో ఉండటంతో ఇక్కడ ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరగడంతోపాటు సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది.

# ఎవరా.. నకిలీ వైద్యులు..?



ధర్మవరం : కింగ్ జార్జి ఆసుపత్రి(కేజీహెచ్)లో నకిలీ వైద్యుల పేరిట బాధితుల నుంచి నగదు దోచుకున్న 'కిడ్నీ ముఠా' వ్యవహారాన్ని ఆసుపత్రి వైద్యులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. వెలుగులోకి వచ్చిన ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద నగర పోలీసు కమిషనర్‌ను కోరారు. ఇటీవల పెద్దాసుపత్రిలో జరుగుతున్న ఘటనలు కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆక్సిజన్ ప్లాంట్‌లో పైపులు కోసేయడం, ప్రసూతి విభాగంలో బిడ్డల తారుమారు ఘటనలు మరువకముందే మరో మోసం వెలుగు చూసింది. తాజా ఘటనలో కేజీహెచ్ వైద్యులమని నమ్మించిన వ్యక్తులు... బాధితుల్ని కేజీహెచ్‌కు రప్పించారు. దీంతో ఆసుపత్రికి చెడ్డపేరు తీసుకురావాలనే ఉద్దేశంతో, గుర్తుతెలియని వ్యక్తులు ప్రణాళికలు అమలు చేస్తున్నారేమోనని వైద్యాధికారులు అనుమానిస్తున్నారు.

**నిశిత పరిశీలన:** రూ.లక్షకే కిడ్నీ ఇస్తామని మోసం చేసిన వారిపై బాధితులు ఇప్పటికే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు... సీసీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆసుపత్రిలోని పిల్లల వార్డు, సూపరింటెండెంట్ కార్యాలయ పరిసరాల్లో సంచరించిన గుర్తుతెలియని వ్యక్తుల వివరాలపై ఆరా తీస్తున్నారు.

**మాయ మాటలతో బురిడీ:** కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి కేజీహెచ్ నుంచి కిడ్నీ ఇస్తామంటూ... మోసగాళ్లు మాయమాటలు చెప్పి బాధితుల్ని బురిడీ కొట్టించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతాయి. జీవన్‌దాన్ ద్వారా బాధితుల పేర్లు నమోదు చేసుకుంటే, బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి కిడ్నీలు సేకరించి అందిస్తారు.

రోజూ 3 వేల మంది..!: ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కేజీహెచ్‌లో ఓపీ విభాగాలకు రోజూ దాదాపు 3 వేల మంది రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగా మరో 1500 మంది చికిత్స పొందుతుంటారు. వారితో పాటు రోగుల సహాయకులు ఉంటారు. నిత్యం వేల మంది సంచరించే కేజీహెచ్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నా... అవాంఛనీయ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భద్రతపై ఆసుపత్రి వర్గాలు మరింత దృష్టి సారించాల్సి ఉంది.

**కఠిన చర్యలు తప్పవు**

ఆసుపత్రికి చెడ్డపేరు తీసుకొచ్చేలా వ్యవహరించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవు. కిడ్నీ ముఠాపై పోలీసులకు ఫిర్యాదు చేసి, విచారణ కోరాం. బయటి వ్యక్తులు చేసిన మోసంతో కేజీహెచ్‌కు సంబంధం లేదు. కేజీహెచ్‌లో వైద్యసేవలు, ఇతర సమాచారం కోసం ఎవరైనా 0891-2590100, 2590102 నంబర్లలో సంప్రదించాలి. కొత్త వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు, మెసెజ్‌లకు రోగులు, వారి సహాయకులు ఎవరూ స్పందించి, మోసపోవద్దు.– డాక్టర్ శివానంద, ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి

# నగరవనం.. అంతా ఆహ్లాదం



అనకాపల్లి : ఏటా పెరుగుతున్న పట్టణీకరణతో నగరాల్లో పచ్చదనం కనుమరుగవుతోంది. అభివృద్ధి పేరుతో తయారవుతున్న కాంక్రీట్ జంగిల్లో పట్టణవాసులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. పని ఒత్తిళ్లు, కాలుష్యం కారణంగా శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా పట్టణాలకు చేరువుగా నగరవనాలను అటవీ శాఖ అందుబాటులోకి తెస్తోంది. అనకాపల్లి నియోజకవర్గం కశింకోట వద్ద ఇప్పటికే శారదావనం ఏర్పాటు చేశారు. ఇందులో అడవి అందాలను ఆస్వాదించేలా సకల సదుపాయాలను సమకూర్చారు. కాంక్రీట్ జంగిల్ నుంచి పచ్చని వనాల మధ్యకు పట్టణ ప్రజలను ప్రకృతి ఆహ్వానించేలా ఈ వనాన్ని తీర్చిదిద్దారు. వీటికి అదనంగా ఎలమంచిలి, నర్సీపట్నం నియోజకవర్గాల్లో మరో రెండు వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఒక్కో నగరవనాన్ని రూ.2 కోట్ల అంచనా విలువతో అభివృద్ధి చేస్తున్నారు. పట్టణాలకు సమీపంలోని 70 నుంచి 120 ఎకరాల అటవీ భూములను ఈ వనాల కోసం ఉపయోగిస్తున్నారు. కశింకోట మండలం బయ్యవరం వద్ద కొండలను ఆనుకుని 120 ఎకరాల్లో శారదావనాన్ని అభివృద్ధి చేశారు. పచ్చని చెట్లు, ప్రకృతి మధ్య ఇంటిల్లిపాది సేదతీరేలా వన కుటీరాలు, పిల్లలు ఉత్సాహంగా ఆడుకునేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటుచేశారు. యువత కోసం ట్రెక్కింగ్, యోగా, ధ్యానం, వ్యాయామం చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. త్వరలో ఎలమంచిలి సమీపంలోని ఎర్రవరం (వేమగిరి రిజర్వ్ ఫారెస్ట్) వద్ద, నర్సీపట్నం నుంచి గొలుగొండకు వెళ్లే మార్గంలో ఆరిలోవ అటవీ ప్రాంతాలను నగరవనాలుగా మార్చనున్నారు.

**ప్రకృతి పాఠం నేర్పేలా..**

పట్టణవాసులకు పచ్చదనంతో పాటు జీవవైవిధ్యం ప్రాధాన్యాన్ని వివరించేలా ఈ వనాలను తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన ద్వారం నుంచి పగోడాలు, కాటేజీలు వరకు పూర్తిగా చెక్కతోనే తయారు చేశారు. ప్రకృతి ఒడిలో పాఠం నేర్పేవిధంగా అక్కడ భూమి సారం నుంచి మొక్కల విశిష్ఠతను వివరించేందుకు ఏర్పాట్లు చేశారు. అంతరించిపోయే చెట్ల జాతులను ఈ వనాల్లో నాటి సంరక్షించనున్నారు. భావితరాలకు అవగాహన కల్పించేలా పర్యావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నర్సీపట్నం అటవీ ప్రాంతంలో ప్రస్తుతమున్న ఔషధ మొక్కల పెంపక క్షేత్రం ధన్వంతరీ వనంలో 35 హెక్టర్లలో కొత్తగా నగరవనం అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ సహజ అటవీ ప్రాంతం కావడంతో ఏడాది పొడవునా ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. కాలుష్యానికి దూరంగా పట్టణవాసులు సేద తీరేడానికి ఎంతో అనువైన ప్రాంతం కూడా.

**సహజ వాతావరణం అందించేందుకే...:** నగరవనాల ద్వారా పట్టణవాసులకు ప్రకృతి, పచ్చదనాన్ని చేరువచేస్తున్నాం. అడవి అందాలను వీక్షిస్తూ శారీరక, మానసిక ఆరోగ్యం పెంచుకునేందుకు వీలుగా వీటిని తీర్చిదిద్దుతున్నాం. ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ అవగాహన కల్పించేందుకు ఇవి దోహదపడతాయి.

–శామ్యూల్, జిల్లా అటవీ అధికారి

# నేతన్నకు మంచి రోజులు

ధర్మవరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు చేయూత అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వైకాపా ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన థ్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని పునరుద్ధరించింది. నిధులు సైతం కేటాయించింది. ప్రస్తుతం ఈ పథకానికి రూ.5 కోట్లు ఇవ్వగా.. అందులో సింహభాగం ఉమ్మడి అనంతకు దక్కనుంది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న చేనేత సహకార సంఘాలలో కార్మికులకు పథకంతో లబ్ధి చేకూరనుంది. కార్మికుడు సంపాదించిన సొమ్ములో 8 శాతం పొదుపు చేసుకుంటే... ప్రభుత్వం థ్రిఫ్ట్ ఫండ్ నుంచి 16 శాతం మేర కార్మికుల ఖాతాకు జమ చేయనుంది. మూడు నెలలకు ఒకసారి కార్మికుల ఖాతాల్లో సొమ్ము జమ కానుంది. దీంతో చేనేత మగ్గాలపై పని చేసే కార్మికులకు లబ్ధి చేకూరనుంది. గత వైకాపా పాలనలో రద్దు చేసిన థ్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని ఇటీవల పునరుద్ధరించడంతో చేనేతల్లో ఆనందం వ్యక్తవుతోంది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 55 చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు దరఖాస్తులు అందాయి. వాటిలో కొన్నింటికి అనుమతులు వచ్చాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో ధర్మవరం, హిందూపురం, మడకశిర... అనంత జిల్లాలో యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, ఉరవకొండ, సిండికేట్నగర్ (అనంతపురం) తదితర ప్రాంతాల్లో కొత్త సంఘాలను ఏర్పాటు చేయనున్నారు.

**3 వేల మందికిపైగా..**

ఉమ్మడి జిల్లాలో సంఘాల ద్వారా 3 వేల మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు. నెలకు చేనేత కార్మికుడు మగ్గం నేయడం ద్వారా రూ.20వేలు సంపాదిస్తే అందులో 8 శాతం (రూ.1600) పొదుపు చేస్తే థ్రిఫ్ట్ ఫండ్ పథకం ద్వారా 16 శాతం



ప్రభుత్వం జమ చేయనుంది. రూ.3200తో పాటు తాను పొదుపు చేసుకున్న రూ.1600 బ్యాంకు ఖాతా నుంచి ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. సంఘాల్లో సభ్యులుగా ఉన్న కార్మికులకు థ్రిఫ్ట్ ఫండ్ ఆర్థిక భరోసా ఇవ్వనుంది. ఉమ్మడి జిల్లాలో కుదేలైన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఊతం కానుంది.

# హెచ్చెల్సీకి పొంచి ఉన్న ముప్పు

ఉరవకొండ : తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)లో నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. ఉరవకొండ మండల పరిసరాల్లోని కాలువలో దాదాపు 1600 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. ప్రధాన కాలువలో నింబగల్లు సమీపంలో రెగ్యులేటరీ గేట్లు మరమ్మతుకు గురయ్యాయి. దాంతో ఎక్కువ నీరు ప్రవహించేందుకు ఆటంకం ఏర్పడుతోంది. ఉరవకొండ మండలం రాయంపల్లి సమీపంలోని అండర్ టన్నెల్ వద్ద గట్టుపై నుంచి నీరు బయటకు పోతున్నాయి. ప్రవాహం ఇలాగే కొనసాగితే గట్టు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు, గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే అండర్ టన్నెల్ శిథిలం అయ్యింది. అధిక నీటి ప్రవాహానికి



అది కూలి పోతుందేమోనన్న భయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇక జీబీసీ సమీసంలో మరో అడుగు నీటి ప్రవాహం పెరిగినా గట్టు తెగిపోతుంది. ప్రధాన షట్టర్ వద్ద గట్టుకు పెద్ద రంధ్రం పడింది. షట్టర్లపై నుంచి నీరు వేగంగా దూకుతున్నాయి. నింబగల్లు వద్ద రెగ్యులేటరీ గేట్లను పైకెత్తితే ప్రవాహం తగ్గిస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. గతంలో ఎన్నడూ లేనంతగా తాగునీటి అవసరాల నిమిత్తం ఈ సారి పీఏబీఆర్, ఎంపీఆర్ జలాశయాలకు నీటిని తరలిస్తున్నారు. ఈ విషయాన్ని హెచ్చెల్సీ దర్గాహొన్నూరు సెక్షన్ ఏఈఈ నిసారుద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా అండర్ టన్నెల్ వద్ద గట్టు మీద నుంచి నీరు బయటికి పోకుండా మట్టి సంచులు ఏర్పాటు చేయిస్తామన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా

ముదిగుబ్బ : ధర్మవరం నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పథకాన్ని నాయకులు సొమ్ముగా మార్చుకుంటున్నారు. ప్రధానంగా చిత్రావతి నది, మద్దిలేరు వాగు నుంచి చుట్టుపక్కల మండలాలు, నియోజకవర్గాలకు రాచమార్గాల్లోనే పెద్దఎత్తున అనుమతి లేకుండా తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసులు, మైనింగ్ శాఖాధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

**పట్టపగలే తవ్వేస్తున్నారు..**

నదీ పరివాహక ప్రాంతాల్లో చుట్టుపక్కల గ్రామాలవారు మాత్రమే ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లొచ్చన్నది ప్రభుత్వ నిబంధన. అయితే కొందరు నాయకులు బత్తలపల్లిలోని గర్శినపల్లి, సంగాల, ఉప్పర్లపల్లి సమీపంలో



నూ, ముదిగుబ్బలోని పీసీరేవు, బూదనాంపల్లి, బ్రహ్మదేవరమర్రి కొట్టాల, ఎస్.బండ్లపల్లి సమీపంలో నుంచి ఇసుక పెద్దఎత్తున తరలిస్తున్నారు. బూదనాంపల్లి, గర్శినపల్లి సమీపంలో ఏకంగా పొక్లెయిన్‌లతో తవ్వి పట్టపగలే తరలిస్తున్నారు. రాళ్లఅనంతపురం క్రాస్‌లో గతంలో చెక్‌పోస్టు ఉండేది. ప్రస్తుతం అది ఎత్తేయడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఇసుక టిప్పర్లలో నింపినందుకు ఒక్కోదానికి రూ.6వేలు, ట్రాక్టర్ అయితే రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు సుమారు 80నుంచి 100 టిప్పర్ల వరకు అక్రమ రవాణా జరుగుతోంది. ట్రాక్టర్లయితే వందకిపైగానే తరలిపోతోంది. ఒకవేళ అధికారులు వాహనాలను పట్టుకుంటే.. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వదిలేస్తున్నారన్నా విమర్శలున్నాయి.

**నిఘా ఉంచుతాం**

ఇసుక అక్రమంగా రవాణా చేయకుండా ప్రత్యేక నిఘా ఉంచుతాం. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి అన్నిశాఖల సమన్వయంతో అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటాం.– రామ్మోహన్, మైన్స్ ఏడీ

# నాణ్యమైన విద్యకు బాట

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా వాసుల చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరింది. అనకాపల్లికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. అనకాపల్లి ఉడ్‌పేట పాఠశాల ప్రాంగణంలో గతంలో సిద్ధం చేసిన భవనాలు, తరగతి గదుల్లో 2024-25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ఆరంభిస్తారు. అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో సర్వే సంఖ్య 511 కేటాయించిన పది ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. అనకాపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం హయాంలో శ్రీకారం చుట్టారు. కేటాయించిన స్థలంలో రూ. 20 లక్షలతో వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ స్థలంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు కోసం రూ. 6 లక్షలు వెచ్చించారు. రూ. 9 లక్షలతో ప్రాంగణంలో తుప్పలు, వ్యర్థాలు తొలగించారు. స్థలంలో తొలగించిన చెట్లకు రూ. 4.20 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అక్కడ భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. భవన సముదాయం సిద్ధమేతే దశల వారీగా ఇంటర్మీడియట్ వరకూ ఇక్కడ తరగతులు నిర్వహిస్తారు. అంతవరకూ ఉడ్‌పేట పాఠశాల ప్రాంగణంలోనే ఈ విద్యాలయాన్ని నిర్వహిస్తారు. ఇందుకోసం ఇక్కడ కూడా అవసరమైన సదుపాయాలు కల్పించాలి. రానున్న విద్యా సంవత్సరంలో ఐదో తరగతి వరకూ ఇక్కడ తరగతులు నిర్వహించనున్నారు. సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న కేంద్రీయ విద్యాలయం అనకాపల్లికి మంజూరు కావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యావంతులు, తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ తరగతులు ఆరంభమవుతాయని ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారు. విద్యాలయం మంజూరుపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు దాడి వీరభద్రరావు, పీలా గోవింద, బుద్ధ నాగజగదీశ్వరరావు హర్షం ప్రకటించారు.

## దేవకన్యలా.. మిత్రవిందగా.. బేబీ లుక్కు అదిరింది..!

షార్ట్ ఫిలిమ్స్ తో కెరీర్ మొదలు పెట్టి ఆ తర్వాత సినిమాల్లో సైడ్ రోల్స్ చేస్తూ బేబీతో హీరోయిన్ గా సూపర్ హిట్ అందుకున్న భామ వైష్ణవి చైతన్య. అమ్మడు హీరోయిన్ గా నటించిన ఫస్ట్ సినిమానే సూపర్ హిట్ అందుకుంది. ఐతే సెకండ్ మూవీగా చేసిన లవ్ మీ సినిమా మాత్రం ఫెయిల్ అయ్యింది. అయినా సరే అమ్మడు ఏమాత్రం జోష్ తగ్గకుండా సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ తో జాక్ సినిమా చేస్తుంది వైష్ణవి చైతన్య. ఆ సినిమాలో సిద్ధు తో మంచి రొమాంటిక్ ఎంటర్టైనర్ గా సినిమా చేస్తున్నట్టుగా ఉంది. బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్ లో వస్తున్న సినిమా కాబట్టి వైష్ణవి చైతన్య లక్కీగా ఫీల్ అవుతుంది. ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది వైష్ణవి చైతన్య. రకరకాల ఫోటో షూట్స్ తో ఫ్యాన్స్ ని మెప్పిస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు దేవకన్యగా మారి



ఫోటో షూట్ చేసింది. పండగ వైబ్ ని మరింత పెంచేలా వైష్ణవి లుక్ ఉంది. ముఖ్యంగా ఒక మహారాణి లుక్ తో కనిపిస్తుంది వైష్ణవి చైతన్య. ఈ ఫోటోలు చూసిన చాలామంది మగధీరలో మిత్రవిందకు ఏమాత్రం తీసిపోదనేలా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. నిజమే అమ్మడి ఫోటో షూట్ ప్లానింగ్స్ ఎవరు ఇస్తున్నారో కానీ యువరాణి గెటప్ లో వైష్ణవి నిజంగానే దేవకన్యలానే కనిపిస్తుంది. జాక్ సినిమా హిట్ పడితే అమ్మడి కెరీర్ కు కాస్త బూస్టింగ్ వస్తుంది. ఐతే సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో హంగామా చేస్తుంది వైష్ణవి చైతన్య. సో అందుకే ఆమె ఫోటో షూట్స్ కి స్పెషల్ క్రేజ్ ఏర్పడుతుంది. అంతేకాదు తన టీం కూడా వైష్ణవిని సోషల్ మీడియాలో బాగా బూస్ట్ చేస్తుంది. తప్పకుండా వైష్ణవికి ఇదంతా కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. జాక్ సినిమా రిజల్ట్ ఏదైనా సరే వైష్ణవి తన ఫోటో షూట్స్ తో ప్రత్యేకమైన క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. అందుకే ఆమె ఇలా ఫోటోస్ షేర్ చేయగానే అలా వైరల్ అవుతున్నాయి. తెలుగు అమ్మాయికి ఇక్కడ మంచి అవకాశాలు వస్తే మరికొంతమంది సినిమాల్లోకి వచ్చే ఛాన్స్ ఉంటుంది. అందుకే వారిలో కాన్ఫిడెన్స్ నింపేందుకు వైష్ణవి తన కెరీర్ బిల్డ్ చేసుకుంటుంది.

## మినీ డ్రెస్ సరే..హ్యాండ్ బ్యాగ్ ధర రూ. 3.20లక్షలు

అందానికి అందం ప్రతిభతో పూజా హెగ్డే దశాబ్దం పైగానే కెరీర్ బండిని సజావుగా సాగించింది. ఇటీవల కొన్ని అవకాశాలు చేజారుతున్నా కానీ, తిరిగి కంబ్యాక్ అవుతున్న తీరు ఆశ్చర్యపరుస్తోంది. పూజా నటించిన యాక్షన్ డ్రామా దేవా (షాహిద్) ఓటీటీలో స్ట్రీమింగుకి వచ్చింది. ఇంతలోనే ప్రచారంలో బిజీగా ఉన్న పూజా ఇదిగో ఇలా కొత్త లుక్కుతో నెటిజనులను కవ్వించింది. ఈసారి ఫ్లోరల్ బొటానిక్ ప్రింటెడ్ గౌనులో బుట్ట బొమ్మ ప్రత్యక్షమైంది. ఇది సమ్మర్ స్పెషల్ డ్రెస్. గింగ్‌హామ్ ప్రింట్ తో 1930ల నుండి జెంజ్ ఫ్యాషన్‌వాదుల్లో చర్చగా మారిన వింటేజ్ లుక్ ఇది, ఎ-లిస్టర్ పూజా హెగ్డే ఈ ఎంపిక అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా పూజా అందమైన మినీ డ్రెస్‌ను



స్టైల్ చేసిన విధానం ఆకట్టుకుంటోంది. ఇక ఈ డ్రెస్ లో పూజా టోన్డ్ బాడీ అందంగా ఎలివేట్ అవుతోంది. ఇక ఈ మినీ డ్రెస్‌లో పూజా భంగిమలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. పూజా హెగ్డే తన తాజా పార్టీ లుక్ స్నాప్‌లను ఇన్‌స్టాలో అందంగా పోస్ట్ చేసింది. ఈ డ్రెస్‌లో అల్టిమేట్ ఐటీ-గర్ల్ వైబ్‌ను వైరల్ చేసింది. మినీ డ్రెస్ ని ఎలివేట్ చేస్తూ టాప్ యాంగిల్ షాట్‌లతో ఫోటోషూట్ ఆద్యంతం రక్తి కట్టించింది. పూజా పర్ఫెక్ట్ గింగమ్ మినీ డ్రెస్ తో రూ. 3,19,000 విలువైన ప్రాడా బ్యాగ్ ని ధరించి కనిపించింది. ఈ లుక్ కోసం పూజా హెగ్డే తెల్లటి సాక్స్ తో బ్లాక్ లోఫర్స్ ని ధరించింది. పూజా ప్రస్తుతం దళపతి విజయ్ సరసన జననాయగన్ చిత్రంలో నటిస్తోంది. రెట్రో, కాంచన 4 లాంటి చిత్రాల్లోను పూజా అవకాశాలు అందుకుంది. ఓ హిందీ చిత్రంలోను నటిస్తోంది.




## నాని గురి పెట్టాడంటే..




నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'హిట్ 3' ఇప్పుడు బాక్సాఫీస్ టార్గెట్‌గా మారింది. మే 1న ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్ల వేగాన్ని పెంచారు. తాజాగా 30 డేస్ కౌంట్‌డౌన్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఇందులో నాని చేతిలో గన్ పట్టుకుని, నోరులో సిగార్‌తో పూర్తిగా యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నాడు. ఈ పోస్టర్ ఒకే ఫ్రేమ్‌లో నాని పవర్ఫుల్ లుక్, కొత్త బాడీ లాంగ్వేజ్‌ను స్పష్టంగా చూపించింది. 'హిట్' ఫ్రాంచైజీలో ఇదే మూడో కేస్. గతంలో విశ్వక్ సేన్, అడివి శేష్‌లు చేసిన ఈ సిరీస్‌లో ఇప్పుడు నాని మెయిన్ లీడ్‌గా వచ్చారు. ఈ సినిమాకోసం నాని పూర్తిగా ట్రాన్స్‌ఫార్మేషన్‌కు లోనయ్యాడు. బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీలోనే కాదు.. క్యారెక్టర్ టోన్‌లోనూ మునుపెన్నడూ చూడని రఫ్ అండ్ టఫ్ స్టైల్‌ని తెచ్చారు. ఇటీవల వచ్చిన టీజర్ ఈ సంగతి చెప్పేసింది. కానీ అదే సమయంలో సినిమా మొదటి పాట మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రేమ బ్యాక్ డ్రాప్ లో ఫస్ట్ సింగిల్ ప్యూర్ మెలోడీగా ఆకట్టుకుంది. శ్రీనిధి శెట్టి - నాని మధ్య కెమిస్ట్రీ ఫ్రెష్‌గా అనిపించడంతో పాటు, హిట్ ఫ్రాంచైజీలో ఈసారి ప్రేమ కోణాన్ని కూడా టచ్ చేశారని తెలియజేసింది. ఈ సాంగ్‌లో నాని డిఫరెంట్ లుక్‌లో కనిపించడం, ప్రేమికుడిగా నటించడం సినిమా మల్టీ లేయర్డ్ నేరేషన్‌కి హింట్ ఇచ్చింది. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి కథను మరింత పెద్ద లెవెల్‌లో ప్రెజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నాడు. నాని ఇందులో వైలెంట్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్టు తెలుస్తోంది. ఇతని క్యారెక్టర్‌లోని బిగ్ ఛాలెంజ్ లతో ఉండే ఒత్తిడిని వేరే కోణంలో చూపించబోతున్నారని సమాచారం. ఇందుకోసం నాని తన నటనలో పెద్ద ఎత్తున మార్పులు తీసుకువచ్చాడు. ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. మే 1న రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రతి వారం ఓ కొత్త అప్‌డేట్‌తో ప్రేక్షకులను ఎంగేజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ టిమ్ విషయాల్లోనూ ఇది మరో లెవెల్‌లో ఉండబోతోంది. మిక్కీ జే మేయర్ అందించిన సంగీతం ఇప్పటికే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తున్నారు. మే 1న విడుదలయ్యే ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలే ఉన్నాయి. ఓ వైపు యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్.. మరోవైపు ఎమోషన్ మెలొడీ మిక్స్‌తో సినిమా బాక్సాఫీస్ వద్ద హిట్ అయ్యే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, 'హిట్ 3' కౌంట్‌డౌన్ పోస్టర్‌తోనే ప్రేక్షకుల్లో హైప్ పెరిగిపోయింది. నాని గురి పెట్టాడంటే బ్లాస్ట్ అవ్వాల్సిందే అనేలా కామెంట్స్ అందుతున్నాయి.

## ప్రదీప్ మాచిరాజు అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి ట్రైలర్ టాక్..!




యాంకర్ గా సూపర్ సక్సెస్ అయిన ప్రదీప్ మాచిరాజు హీరోగా చేసిన తొలి ప్రయత్నం 30 రోజుల్లో ప్రేమించడం ఎలా. ఆ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ప్రదీప్ తన రెండో సినిమాకు చాలా గ్యాప్ తీసుకున్నాడు. ఇక ఫైనల్ ఆ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి వస్తున్నాడు. ప్రదీప్ హీరోగా వస్తున్న ఈ సినిమాను దర్శక ద్వయం నితిన్ భరత్ లు డైరెక్ట్ చేశారు. ఈ సినిమాలో హీరోయిన్ గా మరో యాంకర్ దీపిక పిల్లి నటించింది. రీసెంట్ గా రిలీజైన అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి టీజర్ ఇంప్రెస్ చేయగా లేటెస్ట్ గా సినిమా నుంచి ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ లో మెట్రో పాలిటిన్ సిటీకి ప్రాజెక్ట్ పని మీద వెళ్తాడు హీరో. అక్కడ అతని చెప్పిన పని మాత్రమే చేసే ఓని వాళ్ళు. ఆ ఊళ్లో ఒక పెద్ద మనిషి అతనికి ఒక కూతురు. ఆ ఊళ్లో ఉన్న వాళ్లంతా ఆమెను ప్రేమలో పడేయాలని ట్రై చేస్తారు. కట్ చేస్తే ఒక సందర్భంలో ఆ అమ్మాయి వాళ్ల నాన్న ఈ 60 మందిలోనే ఒకరు తన కూతురిని పెళ్లి చేసుకోవాలని అంటాడు. ఇంతకీ అసలు ఆ ఊరి కథ ఏంటి.. హీరో అక్కడికి వెళ్లి ఏం చేశాడు అన్న కథతోనే అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా వస్తుంది. ఈ సినిమా ట్రైలర్ ప్రదీప్ మాచిరాజు మార్క్ కామెడీ ఎంటర్టైనర్ గా ఉంది. ఈ రోం కాం ఎంటర్టైనర్ ట్రైలర్ ఇంప్రెస్ చేసింది. యాంకర్ గా తనకు స్మాల్ స్క్రీన్ పై ఉన్న ఇమేజ్ ని పర్ఫెక్ట్ గా సినిమాల్లో కూడా వాడుతున్నాడు ప్రదీప్. సినిమాలో ఎంటర్టైన్మెంట్ పాళ్లు ఎక్కువే అన్నట్టుగా కనిపిస్తుంది. రథన్ మ్యూజిక్ ఇంకా సినిమాటోగ్రఫీ కూడా బాగానే ఉండేలా ఉన్నాయి. తొలి సినిమా తర్వాత రెండో ప్రయత్నానికి చాలా గ్యాప్ తీసుకున్న ప్రదీప్ ఒక మంచి ప్రాజెక్ట్ తోనే వస్తున్నారని చెప్పొచ్చు. ప్రదీప్ తో పాటుగా సత్య, దీపిక పిల్లి కూడా అలరించేలా ఉన్నారు. ఏప్రిల్ 11న రిలీజ్ అవుతున్న ప్రదీప్ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి. ట్రైలర్ మాత్రం ఆకట్టుకునేలా ఉంది. బుల్లితెర మీద యాంకర్స్ గా అలరించిన ప్రదీప్, దీపిక ఇలా ఒక సినిమాలో కలిసి నటించడం కూడా స్మాల్ స్క్రీన్ ఆడియన్స్ ని ఎగ్జైట్ చేస్తుంది.

## మహానటి ఇక్కడ నిల్.. అక్కడ బిజీ


'మహానటి' సినిమాతో టాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకున్న హీరోయిన్ కీర్తి సురేష్. మహానటి తర్వాత టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసిన కీర్తి సురేష్ గత రెండేళ్లుగా కొత్త సినిమాలు చేయడం లేదు. ఈమె తెలుగులో చివరగా దసరా సినిమాలో హీరోయిన్‌గా నటించింది. నానితో కలిసి నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా కీర్తి సురేష్‌కి టాలీవుడ్ నుంచి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కడం లేదు. ఒకటి రెండు చిన్న సినిమాల్లో ఛాన్స్ వచ్చినా వాటిని కీర్తి సున్నితంగా తిరస్కరించిందని తెలుస్తోంది. స్టార్ హీరోలు కీర్తి సురేష్‌ను హీరోయిన్‌గా పరిగణలోకి తీసుకోవడం లేదు అనేది సినీ విశ్లేషకుల మాట. టాలీవుడ్‌లో పెద్దగా సినిమాల్లో అవకాశాలు లేకపోయినా కోలీవుడ్, బాలీవుడ్‌లో కీర్తి సురేష్ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. కోలీవుడ్‌లో ప్రస్తుతం ఈమె రెండు సినిమాలు చేస్తోంది. మరో రెండు సినిమాలకు సంబంధించిన



చర్చలు జరుగుతున్నాయని సమాచారం అందుతోంది. పెళ్లి తర్వాత కూడా కోలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా కొనసాగుతోంది. తమిళ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలను ఈ అమ్మడు సొంతం చేసుకుంటుంది. తెలుగులో మాత్రం ఈమెకు స్టార్ హీరోల నుంచి పిలుపు రావడం లేదు. మరో వైపు బాలీవుడ్‌లోనూ ఈమె వరుసగా సినిమాల్లో నటించేందుకు రెడీ అవుతోంది. ఈ అమ్మడు బాలీవుడ్‌లో బేబీ జాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. తమిళ్ సూపర్ హిట్ సినిమాకు రీమేక్‌గా వచ్చిన 'బేబీ జాన్' సినిమా బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. దాంతో బాలీవుడ్‌లో ఈమెకు ఆఫర్లు రాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అయింది. కానీ బేబీ జాన్ ఫలితంతో సంబంధం లేకుండా వెంటనే అక్క అనే వెబ్ సిరీస్‌లో రాధిక ఆప్టేతో కలిసి నటించే అవకాశంను సొంతం చేసుకుంది. త్వరలోనే అక్క వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది. మరో వైపు రివాల్వర్ రీటా గాను కీర్తి సురేష్ కనిపించబోతుంది. బాలీవుడ్‌లో సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్న కీర్తి సురేష్‌కి ఏకంగా రణబీర్ కపూర్‌కి జోడీగా నటించే అవకాశాలు దక్కాయనే వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ మీడియాలో ఈ విషయమై ప్రముఖంగా కథనా లు వస్తున్నాయి. కీర్తి సురేష్ హిందీ కమర్షియల్‌కి సెట్ కాకపోవచ్చు అనే అభిప్రాయంను మొదట్లో చాలా మంది వ్యక్తం చేశారు. నార్త్ హీరోయిన్స్ మాదిరిగా ఈ అమ్మడు పెద్దగా స్కిన్ షో చేయదు. పైగా రొమాంటిక్ సీన్స్‌లో నటించదు. కనుక బాలీవుడ్ సినిమాల్లోనే కాకుండా సౌత్ సినిమా ఇండస్ట్రీలోనూ ఎక్కువ కాలం కొనసాగడం కష్టం అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేశారు. కానీ కీర్తి సురేష్ జోరు చూస్తూ ఉంటే బాలీవుడ్‌లో రాబోయే రోజుల్లో వరుసగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. రణబీర్ కపూర్‌తో సినిమా కన్ఫర్మ్ అయిందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో రాబోయే రెండేళ్లలో కీర్తి సురేష్ హిందీ సినిమా ఇండస్ట్రీలో అర డజనుకు పైగా సినిమాలకు కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టాలీవుడ్‌లో ఆఫర్లు లేని ఈ రీల్ మహానటికి బాలీవుడ్, కోలీవుడ్‌లో ఫుల్ బిజీగా ఆఫర్లు చేతిలో ఉన్నాయి. రాబోయే రోజుల్లోనూ అక్కడ బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి.

## మల్లె చెండు ఒళ్లంతా చుట్టుకుని కలకలం రేపిన నటి

కొత్తొక వింత పాతొక రోత! పాత సంవత్సరానికి భాయ్ చెప్పి కొత్త సంవత్సరానికి వెల్ కం చెప్పింది కన్నడ నటి రాగిణి ద్వివేది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇదిగో ఇలా కొత్తగా కొంగొత్తగా తనని తాను పరిచయం చేసుకుంది. గతాన్ని తలుచుకుని సమయాన్ని వృధా చేసేందుకు రాగిణి సిద్ధంగా లేదు. భవిష్యత్ గురించి మాత్రమే ఆలోచిస్తోంది. అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇదిగో ఇలా మల్లె చెండును ఒంటికి చుట్టుకుని, జెరీ అంచు బంగారు వర్ణం సిల్కు చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతోంది. అలా పానుపుపై జేరబడి, మల్లెలను ముంజేతికి కట్టుకుని సువాసన పీలుస్తూ, అసలు రాగిణి ఇచ్చిన ఫోజ్‌లు కుర్రకారులో కలకలం రేపుతున్నాయి. పానుపుపై బంతిపూల దండల మధ్య రాగిణి రసరమ్యంగా మెరిసిపోతోంది. ఒక కొత్త సంవత్సరం, ఒక కొత్త అధ్యాయం - దానిని ఆశ - దృఢ



సంకల్పంతో స్వీకరించండి! ప్రతి సూర్యోదయం ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది - దీనిని అద్భుత ప్రారంభంగా చేసుకోండి! పండుగ రంగులు మీ జీవితాన్ని ఆనందం, శ్రేయస్సు విజయంతో చిత్రించాలి. కొత్త సీజన్ వికసించినప్పుడు, ఈ పండుగలో మీ కలలు వాస్తవంలోకి వికసించాలి.. అనే అందమైన క్యాప్షన్ ని ఈ ఫోటోలకు జోడించింది.రాగిణి ద్వివేది కన్నడ నాట అగ్ర కథానాయిక. స్టార్ హీరోల సరసన నటించిన ఈ బ్యూటీ పేరు ఇంతకుముందు డ్రగ్స్ స్కాండల్ లో వినిపించింది. కొద్దిరోజుల పాటు జైలు జీవితాన్ని కూడా అనుభవించి బయటకు వచ్చింది. ఇటీవల తిరిగి తన కెరీర్ పై నే ఫోకస్ చేసింది. జీవితంపై పాజిటివ్ దృక్పథం కలిగి ఉన్న రాగిణికి మునుముందు నటిగా మంచి అవకాశాలు దక్కాలని ఆకాంక్షిద్దాం. రాగిణికి ఉగాది శుభాకాంక్షలు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536